


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 09 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 34 పేజీలు : 4 వెల : రూ 3-00


## శివప్రసాద్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం: సజ్జల

వైఎస్సార్ జిల్లా: ప్రొద్దుటూరులోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి నిర్వహించిన బహిరంగ సభకు ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. "సొంత నిధులతో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా రైతాంగానికి




సంక్షేమం అందించేందుకు ఆర్‌బీకే కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలు స్వయంగా తమ కాళ్లపై నిలబడేలా అభివృద్ధి చెందాలనేదే ముఖ్యమంత్రి ఆలోచన" అని తెలిపారు."ఎంత త్వరగా రైతులను ఆదుకుంటున్నాము అనేదే ఇక్కడ ముఖ్యం.. పంటల బీమా, పరిహారం, ఇన్పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వడం ద్వారా రైతులకు వడ్డీ భారం లేకుండా చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రకటించి ఐదేళ్లలో కూడా పూర్తిగా చెల్లించలేదు. అలా కాకుండా ఎప్పటికప్పుడు ఇచ్చిన హామీని పూర్తి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అభిప్రాయం. ఇవాళ దేశంలో అనేక రాష్ట్రాలు మన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకొంటున్నాయి" అని సజ్జల తెలిపారు."స్వచ్ఛమైన ఆలోచన, అన్ని వర్గాలను తన కుటుంబాల లాగా భావించి కార్యక్రమాలు అమలు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ ఆలోచన. గ్రామాల్లో ఆర్‌బీకేల్లో మరింత మెరుగ్గా పనిచేసేందుకు వీలుగా స్థానిక నేతలు సహకారం కావాలి. సహకార రంగం మరింత బలోపేతం కావాలంటే గ్రామాల్లో నేతలు కలిసి పనిచేయాలి. జిల్లాకు నీరు వస్తుందా రాదా అన్న కల నుంచి ఇప్పుడు 60 టీఎంసీల నీరు నిల్వ చేసే స్థాయికి వెళ్లడం వైఎస్ కుటుంబం చలువ. వరద జలాలు కిందికి వృధాగా వెళ్లకుండా నీటిని ఒడిసిపట్టి నీటిని నిల్వ చేసుకుంటున్నాం" అన్నారు సజ్జల.

# ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కాన్సెప్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: సీఎం జగన్

తాడేపల్లి: వైద్య, ఆరోగ్య శాఖలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో కోవిడ్ ?19 నివారణ, నియంత్రణ, వ్యాక్సినేషన్‌పై అధికారులు సీఎం జగన్‌కు వివరాలందించారు. రాష్ట్రంలో యాక్టివ్ కేసులు 14,452 ఉండగా.. రికవరీ రేటు 98.60 శాతంగా ఉందని తెలిపారు. 10,494 సచివాలయాల్లో యాక్టివ్ కేసులు నమోదు శాతం జీరో అని అధికారులు తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారు 3,560 మంది కాగా.. కోవిడ్ కేర్ సెంటర్లలో చికిత్స పొందుతున్నవారు 926 మంది.. హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నవారు 9,966 మంది ఉన్నారని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న బెడ్స్ 92.50 శాతం ఉండగా.. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న బెడ్స్ 70.69 శాతం ఉన్నాయన్నారు. 104 కాల్ సెంటర్‌కు 684 ఇన్‌కమింగ్ కాల్స్ మాత్రమే వచ్చాయని తెలిపారు. 18 దఫాలుగా ఇప్పటివరకు ఫీవర్ సర్వే పూర్తి చేశామని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు.కోవిడ్ థర్డ్ వేవ్‌ను ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ప్రస్తుతానికి రాష్ట్రంలో 20,964 ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్ అందుబాటులో ఉన్నాయని.. ఇంకా రావాల్సినవి 2493 ఉన్నాయన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆక్సిజన్ డి?టైప్ సిలిండర్లు 27,311 కాగా.. ఆక్సిజన్ పైప్‌లైన్ పనులు పూర్తైన ఆస్పత్రులు 108 అని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. 50 అంతకంటే ఎక్కువ బెడ్స్ ఉన్న ఆస్పత్రుల్లో ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్లు ఏర్పాటు చేశామని అధికారులు సీఎం జగన్‌కి వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 140 ఆస్పత్రులలో పీఎస్ఏ ప్లాంట్లు ఏర్పాటు చేశామని.. అక్టోబరు 6 నాటికి ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటు పూర్తవుతుందని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు వ్యాక్సినేషన్ చేయించుకున్నవారు 2,23,34,971 మంది ఉండగా.. వీరిలో సింగిల్ డోసు వ్యాక్సినేషన్ పూర్తైన వారు 1,31,62,815 మంది కాగా.. రెండు డోసుల వ్యాక్సినేషన్ పూర్తైన వారు 91,72,156 మంది అని అధికారులు సీఎం జగన్‌కి తెలిపారు. ఇటీవల కేరళలో పర్యటించిన అధికారులు, వైద్యాధికారుల బృందం కోవిడ్‌తో పాటు ఇతర క్షేత్రస్థాయి పరిశీలనాంశాలను సీఎం జగన్‌కు వివరించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "శిశు మరణాలను తగ్గించాలి. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఫ్యామిలీ హెల్త్ డాక్టర్ కాన్సెప్ట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. చక్కటి విధివిధానాలను ఖరారు చేయాలి. కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో పీజీ కోర్సులు కూడా ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలి. పారామెడికల్ సిబ్బందికీ మెడికల్ కాలేజీల్లో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. పబ్లిక్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్‌పై కోర్సులు దృష్టి పెట్టాలని" అధికారులను ఆదేశించారు. "ప్రజారోగ్యంపై నిరంతర పరిశీలన, పర్యవేక్షణ ఉండాలి. రక్తం, నీరు, గాలి ఈ మూడింటిపైన పరీక్షలు జరగాలి. విలేజ్ క్లినిక్స్ స్థాయిలో ఈ పరీక్షలు అందుబాటులో ఉండాలి. అవసరమైన చోట సీహెచ్‌సీల్లో కూడా డయాలసిస్ యూనిట్లు అందుబాటులోకి తీసుకురావాలి. హెల్త్‌డేటాపై అన్నిరకాల చర్యలు తీసుకోవాలి. ఎక్కడ పరీక్షలు



చేయించుకున్నా, ఎక్కడ చికిత్స తీసుకున్నా గుర్తింపు కార్డు ద్వారా ఆ వివరాలతో కూడిన డేటా అప్‌లోడ్ చేయాలి. ఒక వ్యక్తి వైద్యంకోసం ఎక్కడకు వెళ్లినా ఆ వివరాలు డాక్టర్‌కు వెంటనే అందుబాటులోకి వచ్చే విధానం ఉండాలి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా, విలేజ్ క్లినిక్ నుంచి టీచింగ్ ఆస్పత్రి వరకూ ఎక్కడికి వెళ్లినా... అక్కడ చేయించుకున్న పరీక్షల వివరాలు, చికిత్స వివరాల డేటా అప్‌లోడ్ కావాలి. దీనికి సంబంధించి మంచి సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం జగన్ సూచించారు. థర్డ్‌వేవ్ సమాచారం నేపథ్యంలో కోవిడ్ నియంత్రణకు నూతన చికిత్సా విధానాలపై దృష్టి సారించాలన్న సీఎం.. కొత్త మందులు, మెరుగైన ఫలితాలు, తక్కువ దుష్ప్రభావాలు ఉన్నవాటి వినియోగంపై దృష్టిపెట్టి అన్నిరకాలుగా సిద్ధం కావాలని తెలిపారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్(నాని), సీఎస్ ఆదిత్యనాథ్ దాస్, కోవిడ్ కమాండ్ కంట్రోల్ ఛైర్ పర్సన్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, 104 కాల్ సెంటర్ ఇంఛార్జ్ ఎ బాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కాటమనేని భాస్కర్, ఆరోగ్యశ్రీ సీఈఓ వి వినయ్ చంద్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ అండ్ ఎండీ డి మురళీధర్ రెడ్డి, పరిశ్రమలశాఖ డైరెక్టర్ జే వి యన్ సుబ్రమణ్యం, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రైవేటు స్థలాల్లో వినాయక చవితి ఉత్సవాలకు హైకోర్టు ఓకే




అమరావతి: రాష్ట్రంలో జరిగే వినాయక చవితి ఉత్సవాలపై ఏపీ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలయింది. ప్రైవేటు స్థలాల్లో వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన కార్యక్రమాలను నిరోధించే హక్కులేదని హైకోర్టు స్పష్టం చేసింది. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి ఐదుగురికి మించకుండా పూజలు చేసుకోవాలని కోర్టు సూచించింది.పబ్లిక్ స్థలాల్లో విగ్రహాలు పెట్టుకుని, ఉత్సవాలు నిర్వహించడంపై హైకోర్టు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రభుత్వం తీసుకున్న చర్యలను హైకోర్టు సమర్థించింది. ప్రైవేటు స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు ఇచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం మతపరమైన కార్యక్రమాలను నిర్వహించుకునే అధికారం ఉందని హైకోర్టు స్పష్టం చేసింది.

## ఉన్నతవిద్యలో వైవిధ్యత గల కోర్సులను ప్రవేశపెట్టాలి: ఉపరాష్ట్రపతి



చెన్నై: ఉన్నతవిద్యలో వీలైనన్ని వైవిధ్యమైన కోర్సులను ప్రవేశపెట్టడం ద్వారా విశ్వవిద్యాలయాల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసినట్లు అవుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. భారతీయ యువత సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, వారి శక్తియుక్తులను దేశాభివృద్ధికోసం సద్వినియోగం చేసుకునేలా ఈ కోర్సులకు రూపకల్పన జరగాలని ఆయన సూచించారు. విజ్ఞాన సముపార్జనతోపాటు విస్తృతమైన ఉపాధి అవకాశాల కోసం ఈ మార్పులు మూలభూతం కావాలన్నారు. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమేటిక్స్) విషయాలను, ఆర్ట్స్ విషయాలతో సమ్మిళితం చేయడం ద్వారా రెండు అంశాల్లోనూ విద్యార్థుల పరిజ్ఞానాన్ని పెంచేందుకు వీలవుతుందంటూ పలు పరిశోధనల్లో వెల్లడైన అంశాన్ని ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. 21వ శతాబ్దంలో భారతదేశ అవసరాలకు అనుగుణంగా విద్యారంగంలో ఇలాంటి మార్పులు చోటుచేసుకోవాలని ఆయన అభిలషించారు.మానవీయ శాస్త్రాలను అభ్యసించే విద్యార్థులకు కూడా సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన కనీస పరిజ్ఞానాన్ని అందించే దిశగా చొరవతీసుకోవాలని, తద్వారా విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకెళ్లేందుకు వీలవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ శ్రీసిటీలోని క్రియా విశ్వవిద్యాలయంలోని 'మోటూరి సత్యనారాయణ సెంటర్ ఫర్ అడ్వాన్స్ స్టడీ ఇన్ హ్యూమానిటీస్' కేంద్రాన్ని చెన్నై రాజ్ భవన్ నుంచి అంతర్జాల వేదిక ద్వారా ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాచీన కాలం నుంచే భారతదేశంలో సంపూర్ణ విద్యావిధానాన్ని (అన్ని విషయాలను విద్యార్థులకు బోధించే) అనుసరించే సంప్రదాయం ఉందని ఆయన గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ-2020) కూడా ఈ దిశగా భారతదేశ ప్రస్తుత విద్యావిధానంలో సానుకూల మార్పులు తీసుకురానుందని తెలిపారు.ఇటీవల ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్ కోర్సులతో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ఐఐటీ ? బాంబే ప్రారంభించడాన్ని ఉపరాష్ట్రపతి ఈ సందర్భంగా అభినందించారు. మరిన్ని విద్యాసంస్థలు కూడా ఇలాంటి చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు కూడా ఆర్ట్స్, సైన్స్ కోర్సుల్లో తమ పిల్లలను చేర్పించడం ద్వారా వారి సర్వతోముఖాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. పాఠశాల నుంచే ఇలాంటి విధానాలను అనుసరించడంపైనా విద్యాశాఖ దృష్టి పెట్టాలని ఆయన సూచించారు.మోటూరి సత్యనారాయణ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా కేఆర్ఈఏ విశ్వవిద్యాలయం నిర్వాహకులను, మోటూరి సత్యనారాయణ కుటుంబ సభ్యులను ఉపరాష్ట్రపతి అభినందించారు. సామాజిక విజ్ఞానంలో పరిశోధలకోసం ఇలాంటి కేంద్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేంద్రం నిర్వాహకులు విధాన నిర్ణేతలతో కలిసి సమాజంలో మార్పుకోసం మరింత సమన్వయంతో కృషిచేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు.ముఖ్యంగా ఉన్నత కుటుంబాలు విద్య, వైద్యం, విజ్ఞాన రంగాల అభివృద్ధి కోసం ముందుకు రావాలని, ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించిన ఆయన, నేర్చుకోవాలి, సంపాదించుకోవాలి, సమాజ అభివృద్ధి కోసం నలుగురితో పంచుకోవాలి (లెర్న్... ఎర్న్... రిటర్న్ టూ సొసైటీ) అనే నినాదాన్ని ఇచ్చారు.స్వాతంత్ర్య సమరయోధుడు, పార్లమెంటేరియన్ అయిన మోటూరి సత్యనారాయణకు ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ఘనంగా నివాళులు అర్పించారు.

## ఏపీ పర్యాటకానికి ప్రత్యేక యాప్: మంత్రి అవంతి

అమరావతి: కరోనా వ్యాప్తితో పర్యాటక శాఖకు నష్టం వచ్చిందని మంత్రి అవంతి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో 13 చోట్ల 5 స్టార్ స్థాయి హోటళ్లను నిర్మిస్తామని ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయి హోటళ్లను నిర్మిస్తామని చెప్పారు. ప్రసాదం పథకం కింద శ్రీశైలంలో అభివృద్ధి చేశాం.. సింహాచలంలో ఆ పథకం కింద రూ. 50 కోట్లతో అభివృద్ధి చేస్తామని వివరించారు.పర్యాటన ప్రాంతాల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతామని పేర్కొన్నారు. స్థానిక పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేక ప్యాకేజిలు రూపొందిస్తామని వెల్లడించారు. సీ ప్లేన్స్ కూడా తీసుకొచ్చి విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నట్లు గుర్తుచేశారు. 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం




ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. పర్యాటక ప్రాంతాల్లో మద్యం ప్రోత్సహించాలన్నది తమ ఉద్దేశం కాదని స్పష్టం చేశారు. మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.కరోనాతో చనిపోయిన ఇద్దరు పర్యాటక కాంటాక్ట్ ఉద్యోగుల కుటుంబంలో వారికి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీస్కున్నట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు. 36 పర్యాటక హోటళ్లలో నిర్వహణ పర్యాటకులకు ఇబ్బంది లేకుండా చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నీళ్లు, ఆహారం వంటి సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో అందమైన సముద్రం... అడవులు ఉన్నాయని, ఎకో టూరిజం అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. త్వరలో ఒక యాప్ తీసుకురాబోతున్నామని.. దసరాకు టూరిజం యాప్ సిద్ధమవుతుందని మంత్రి తెలిపారు. లోకల్ టూరిస్ట్‌లకు నాలుగు జోన్లుగా చేస్తున్నామని, జోన్‌కొక మేనేజర్ ఉంటాడని చెప్పారు.

## ఆళ్లగడ్డ లో ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణీ

:: ఆవుల పుల్లా రెడ్డి సేవాసమితి.

ఆళ్లగడ్డ ::(విభారె న్యూస్):: వినాయక చవితి పర్వదినం ఈ సందర్భం గా ఆళ్లగడ్డ పట్టణంలోని ఆవుల పుల్లా రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ చేస్తున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు ఆవుల విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. విగ్రహాలు అవసరమైన భక్తులు తప్పనిసరిగా మాస్కు ధరించి, ఆవుల పుల్లా రెడ్డి సేవా సమితి వారిని సంప్రదించాలి. రసాయనాలతో తయారుచేసిన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, అందుకే మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు. థర్డ్ వేవ్ ముప్పు పొంచి ఉన్నందున భక్తులందరూ కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వినాయక చవితి పండుగ జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన ఆళ్లగడ్డ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సైనికుల త్యాగాలకు నిలువుటద్దం యుద్దాల ఫలితం




ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్

విజయవాడ సెప్టెంబర్ 8 (ఎక్స్ ప్రెస్ న్యూస్);యుద్దాలు సైనికుల అత్యున్నత త్యాగాలకు నిలువుటద్దం వంటివని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. యుద్దాల ఫలితంగా సిద్దించే విజయాల వెనుక పలువురు సైనికుల బలిదానం ఉంటుందని, ఇది అయా కుటుంబాలకు అపారమైన కష్ట నష్టాలను అపాదిస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. విజయవాడ రాజ్ భవన్‌లో రాష్ట్ర సైనిక్ సంక్షేమ విభాగం బుధవారం నిర్వహించిన 'స్వర్ణిం విజయ్ వర్ష్' కార్యక్రమానికి గవర్నర్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. 1971 నాటి యుద్ధంలో భారతదేశం విజయం సాధించిన నేపథ్యంలో 'స్వర్ణిం విజయ్ వర్ష్' పేరిట 50వ వార్షికోత్సవాన్ని జరుగుకుంటుండగా రాష్ట్ర వేడుకలకు రాజ్ భవన్ వేదిక అయ్యింది. గౌరవ గవర్నర్ హరిచందన్ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు పౌరులు సైతం సామాజిక బాధ్యతగా భావించి మాజీ సైనికుల అవసరాలపై అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సైనిక సంక్షేమ సంస్థ వీరి సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంతమేర కృషి చేస్తాయన్న విశ్వాసం తనకుందన్నారు.ఈసందర్భంగా 1971 నాటి యుద్ధ వీరులు, కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్ నాటి విషయాలను గుర్తు చేసుకుంటూ చరిత్రలో 1971 నాటి యుద్ధం అతిచిన్న యుద్ధాలలో ఒకటి మాత్రమేనని, కేవలం 13 రోజులు మాత్రమే కొనసాగిందని అయితే భారత సైన్యం పాకిస్తాన్ పై నిర్ణయాత్మక, చారిత్రాత్మక విజయాన్ని సాధించిందన్నారు. ఈపరిణామాలఫలితంగానే 'బంగ్లాదేశ్‌ఏర్పాటు' సాధ్యమైందన్నారు. యుద్ధ సమయంలో, భారత్, పాకిస్తాన్ సైనిక పటాలాలు ఏకకాలంలో తూర్పు, పశ్చిమ సరిహద్దులలో ఘర్షణ దిగాయని, పాకిస్తాన్ సైన్యం 1971 డిసెంబర్ 16న ఢాకాలో లొంగిపోతున్నట్టు ఒడంబడికపై సంతకం చేసిన తర్వాత యుద్ధం ముగిసిందన్నారు. ఈ క్రమంలో పాకిస్తాన్ ఆర్మీకి చెందిన దాదాపు 93,000 మంది సైనికులు భారత సైన్యానికి లొంగిపోయారని గవర్నర్ అన్నారు. ఈ విజయం ఇతర దేశాలలో భారతదేశ ఔన్నత్యాన్ని పెంచిందన్నారు. 2020 డిసెంబర్ 16న 'స్వర్ణిం విజయ్ వర్ష్'ను ప్రారంభించిన ప్రధాని విజయ జ్యోతిని ప్రజ్వలింపచేసారన్నారు.జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద ప్రారంభమైన విజయ జ్వాల దేశ వ్యాప్తంగా ప్రయాణిస్తూ విజయవాడ చేరుకోవటం ముదావహమన్నారు. తమ ప్రాణాలను త్యాగం చేసిన చెందిన సాయుధ దళాల సిబ్బందికి దేశం రుణపడి ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా తొలుత విజయ జ్వాల కార్యక్రమం ఇన్ చార్జి అధికారి వీఎం రాజు నుండి గవర్నర్ విజయ జ్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ 1971 నాటి యుద్ధ వితంతువులు, వికలాంగులకు శౌర్య అవార్డులతో సత్కరించారు.

## ముగిసిన దుర్గగుడి పాలకమండలి సమావేశం

విజయవాడ: దుర్గగుడి పాలకమండలి బుధవారం రోజున ఏర్పాటు చేసిన సమావేశం ముగిసింది. పలు అంశాలపై పాలకమండలి చర్చించారు. సుమారు 66 అజెండాలపై చర్చించి, చాలా వరకు అంశాలను పాలక మండలి ఆమోదించారు. రానున్న దసరా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లను చేస్తున్నట్లు పాలకమండలి వెల్లడించింది. ప్రతి భక్తుడికి 250 గ్రాముల దద్దోజనం, 250 గ్రాముల సాంబార్ రైస్‌ను ప్రసాదంగా ఇవ్వాలని దుర్గగుడి పాలకమండలి నిర్ణయించింది. ఆలయానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కుంకుమ, అమ్మవారి ప్రతిమ ఉన్న డాలర్‌ను ఇవ్వనున్నట్లు పాలకమండలి పేర్కొంది.



దసరా ఏర్పాట్లను చేయడానికి పాలకమండలి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. కలెక్టర్, కో ఆర్డినేషన్ కమిటీల సమన్వయంతో ఉత్సవాలకు బడ్జెట్‌ను కేటాయిస్తామని పేర్కొంది. గత దసరాకి ముఖ్యమంత్రి కేటాయించిన రూ. 70 కోట్ల నిధులకు సంబంధించి పనులను పూర్తి చేస్తున్నట్లు దుర్గగుడి దేవస్థానం చైర్మన్ పైలా స్వామినాయుడు, ఈవో భ్రమరాంబ వెల్లడించారు.

# సంపాదకీయం

గురువారం 09 సెప్టెంబరు 2021

## కనిపించని కాంగ్రెస్ ఫ్యూచర్

వందేళ్లకు పైగా చరిత్ర, సుదీర్ఘకాలం ఇటు కేంద్రంలో, అటు రాష్ట్రాల్లో చక్రం తిప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సమస్యల సంద్రంలో కొట్టుమిట్టాడుతోంది. ఏం చేయాలోతెలియక అయోమయంలో ఉంది. వరుసగా 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి, ఒక్కొక్కటిగా చేజారిపోతున్న రాష్ట్రాలు, అధికారంలో ఉన్నచోట్ల అంతర్గత కలహాలు పార్టీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్ గఢ్ ల్లో పరిస్థితులు ఎంతమాత్రం సాఫీగా లేవు. సహజంగానే ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. దీనికి తోడు తాజాగా మరో సమస్య కాంగ్రెస్ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. అదే ఆర్థిక సంక్షోభం.రోజువారీ అవసరాలకు కటకటలాడాలల్సిన పరిస్థితి నెలకొంది.దీంతో కాంగ్రెస్ పార్టీ అనివార్యంగా పొదుపు మంత్రం జపిస్తోంది. కిందిస్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకుఅంటే కార్యకర్త నుంచి కార్యదర్శి వరకు ప్రతి ఒక్కరూ పొదుపు పాటించాలని సూచించింది. ఈ మేరకు కేంద్రమాజీ మంత్రి, పార్టీ కోశాధికారి పవన్ కుమార్ బన్సల్ పార్టీ ప్రముఖులకు వ్యక్తిగతంగా లేఖలు రాశారు. పార్టీ ఆర్థిక పరిస్థితి ఎంతమాత్రం బాగాలేదని, ఖర్చులు తగ్గించుకోవాలని బన్సల్ ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా అభ్యర్థించారు. అంతేకాక పార్టీకి చెందిన ప్రతి పార్లమెంటు సభ్యుడు ఏటా కనీసం రూ.50 వేలు విరాళంగా ఇవ్వాలని కోరారు. దీనితో పాటు ఏటా కనీసం ఇద్దరు సానుభూతి పరులతో రూ.40,000 వంతున విరాళం ఇప్పించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ పరమైన పనులకు సంబంధించి రైలు, విమాన ప్రయాణాల్లో అధికారికంగా లభించే సౌకర్యాలను వాడుకోవాలని తెలిపారు. దీని ద్వారా పార్టీ పై అదనపు భారం కొంతవరకు తగ్గుతుందని వివరించారు. కొందరు పార్లమెంటు సభ్యులు పార్టీ ప్రధాన కార్యదర్శులుగా ఉండటంతో బన్సల్ ఈ సూచన చేశారు.కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు అయితే 1400 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అది దాటితే తక్కువశ్రేణి విమాన ఛార్జీలు వారికి చెల్లిస్తారు. అది కూడా రైలు టిక్కెట్ కన్నా విమాన చార్జీ తక్కువగా ఉన్నప్పుడే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. దీనిని కూడా నెలకు రెండుసార్లకే పార్టీ పరిమితం చేయడం గమనార్హం. రోజువారీ ఖర్చులపైనా పార్టీ పరిమితులు విధించింది. విద్యుత్తు, ఇంధనం, క్యాంటీన్ తదితర ఖర్చులనూ తగ్గించుకోవాలని పవన్ కుమార్ బన్సల్ ప్రత్యేకంగా కోశాధికారి హోదాలో సూచించారు. ఇక కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులకు ఇచ్చే భృతిలోనూ కోత విధించారు. పార్టీ కార్యదర్శికి రూ.12వేలు, ప్రధాన కార్యదర్శికి రూ.15వేలు వంతు న భృతి ఇస్తుండగా దానిలోనూ కోత విధించారు. పార్టీకి వచ్చే ఆదాయంలోనూ గణనీయంగా కోత పడటం ఆందోళనకు గురి చేస్తోంది. కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఆదాయం బాగా పడిపోయింది. 2018-19లో పార్టీకి రూ.383 కోట్ల మేరకు ఎన్నికల బాండ్లు రాగా, 2019-20లో రూ.318 కోట్లకు తగ్గడం పార్టీ నాయకులకు మింగుడు పడటం లేదు. అదే సమయంలో అధికార భారతీయ జనతా పార్టీ ఆదాయంలో విశేష వృద్ధి కనపడుతోంది. కేంద్రంలో వివిధ రాష్ట్రాల్లో అధికారంలో కొనసాగుతున్న కాషాయ పార్టీ ఆదాయం రూ.1450 కోట్ల నుంచి ఏకంగా రూ.2,555 కోట్లకు పెరగడం విశేషం. సహజంగా ఏ పార్టీ అయినా అధికారంలో ఉన్నప్పుడు దాని ఆర్థిక పరిస్థితి కచ్చితంగా బాగానే ఉంటుంది. పారిశ్రామికవేత్తలు విరాళాలు ఇవ్వడానికి బారులు తీరుతుంటారు. అడిగినంత ఇవ్వడానికి సిద్ధంగా ఉంటారు. ఇందుకు కారణాలు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అధికార పార్టీతో వారికుండే వివిధ రకాల అవసరాలే వారిని ఈ దిశగా పయనింపజేస్తుంటాయి. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో లేదు. అందువల్లే పార్టీకి వివిధ వర్గాల నుంచి విరాళాలు, రాబడిలో కోత పడుతోంది. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ కోశాధికారుల చాకచక్యం కూడా కొంతవరకు కారణమవుతుంది. మరో వైపు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీనే నియమించాలంటూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ తీర్మానం చేసింది. సోనియా గాంధీ ప్రస్తుతం తాత్కాలిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి అధ్యక్షుడి ఎంపికపై పార్టీ సీనియర్లు సైతం పలు ప్రకటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో యూత్ కాంగ్రెస్ చేసిన తీర్మానం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గోవాలోని పనాజీలో జరిగిన ఇండియన్ యూత్ కాంగ్రెస్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో ఈ తీర్మానం చేసి పార్టీ అధిష్టానానికి పంపించారు. దీనికి సంబంధించిన కాపీని యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ సోమవారం ట్విట్టర్‌లో పంచుకున్నారు. రాబోయే రోజుల్లో యూత్ కాంగ్రెస్ దేశ ప్రయోజనాల దృష్ట్యా పలు సమస్యలపై పోరాడుతుందంటూ పేర్కొన్నారు.కాగా.. 2017లో సోనియాగాంధీ నుంచి రాహుల్ గాంధీ పార్టీ అధ్యక్ష పగ్గాలను తీసుకున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల వరకూ ఆయన పార్టీకి సారథ్యం వహించారు. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 52 సీట్లతో దారుణమైన ఫలితాలను చవిచూసింది. పార్లమెంటులో పది శాతం సీట్లు కూడా పొందలేకపోవడంతో.. పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ.. రాహుల్ గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసారు. దీంతో సోనియాగాంధీ మళ్లీ ఏఐసీసీ తాక్కలిక చీఫ్‌గా బాధ్యతలను చేపట్టేందుకు అంగీకరించారు.గతంలో బిహార్ కు చెందిన సీతారాం కేసరి, మధ్యప్రదేశ్ కు చెందిన మోతీలాల్ వోరా వంటి దిగ్గజాలు ఆర్థిక వ్యవహారాలను పకడ్బందీగా నిర్వహించే వారు. ఇప్పుడూ పవన్ కుమార్ బన్సల్ పార్టీ పరిస్థితిని చక్కదిద్దేందుకు తన వంతు శ్రమిస్తున్నారు. అందులో భాగమే ఈ పొదుపు మంత్రం

# జనసేన ఎఫెక్ట్‌తో మార్పు సాధ్యమా

విజయవాడ, సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)కరోనా పుణ్యమా? అని రోడ్డెక్కి ఆందోళన చేసే రాజకీయపార్టీలు లేవు. ఒకవేళ గొంతు చించుకున్నా పట్టించుకునే నాథుడూ లేడు. పార్టీలు సాధారణ జనంతో మమైకమయ్యే అజెండాను ఎప్పుడో వదిలేశాయి. రాజకీయ కారణాలతో రచ్చ చేస్తున్నాయి. అధికారపార్టీలకు అందుకే ప్రతిపక్షాలంటే అలుసుగా మారింది. పొరుగున ఉన్న తెలంగాణలో కొంతమేరకు ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని కదిలించ గలుగుతున్నాయి. ప్రతిపక్షాల ఐక్యబలం కంటే తనకున్న ప్రజాదరణ తక్కువన్న సంగతి టీఆర్ఎస్ కు తెలుసు. కానీ ఆంధ్రప్రదేశ్ లో పరిస్థితులు భిన్నం. ప్రతిపక్షాల మొత్తం ఓటింగు కంటే వైసీపీదే ఆధిక్యం. శాసనసభ ఎన్నికల్లోనే కాదు, ఇటీవలి స్థానిక ఎన్నికల వరకూ ఆ ట్రెండ్ కొనసాగింది. అసలు ప్రతిపక్షాలను, వాటి డిమాండ్లను కేర్ చేయాల్సిన అవసరమే లేదని ప్రభుత్వం ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చేసింది. ఈ దశలో జనసేన చేపట్టిన రోడ్ల ఉద్యమం ప్రభుత్వానికి సెగ తగిలేలా చేసింది. ప్రజలలో స్పందన కనిపించడంతో ఒక్కసారిగా ఉలికి పడింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రంగంలోకి దిగి అధికారులతో సమీక్ష చేయాల్సి వచ్చింది. అయితే ఇది జనసేన విజయం గా కంటే ఇష్యూ ప్రాధాన్యమే ప్రభుత్వాన్ని కలవరపరిచినట్లుగా చెప్పాలి.జనసేనకు పవన్ కల్యాణ్ అభిమాన సేన అండగా ఉంది. వారు కొంతమేరకు రిస్క్ చేసి తమ పంతం నెగ్గించుకోగలరు. కానీ ఇంతకాలం వారికి సరైన మార్గదర్శకత్వం కరవైందనే చెప్పాలి. ఆందోళనలు చేసి అరెస్టులు వరకూ తెచ్చుకుని కెరియర్ ను నాశనం చేసుకునేందుకు ఈ కాలంలో ఎవరూ సిద్ధంగా లేరు. అయితే తమ అభిమానాన్ని సామాజిక మాధ్యమాలు, సినిమా పంక్షన్లలో చాటి చెప్పడం వరకూ అయితే సర్వదా సిద్ధం. జనసేన ఒక రాజకీయ పార్టీగా పిలుపునిచ్చిన కార్యక్రమాలు పెద్దగా సక్సెస్ కావడం లేదు. పవన్ కల్యాణ్ స్వయంగా పాల్గొంటే మాత్రమే కొంత స్పందన కనిపిస్తోంది. కానీ తాజాగా రాష్ట్రంలో రోడ్ల దుస్థితిపై సామాజిక మాధ్యమాల వేదిక గా బహిరంగ పరచమంటూ పవన్ ఇచ్చిన పిలుపుకు అనూహ్యంగా కదలిక వచ్చింది. ప్రత్యేకంగా పవన్ ఫ్యాన్స్ తమ చేతిలోని మొబైల్ నే రాజకీయ ఆయుధంగా చేసుకుంటూ విరుచుకు పడ్డారు. లక్షల్లో ట్వీట్లు, అధ్వాన్నమైన రోడ్ల దుస్థితితో సోషల్ మీడియా హోరెత్తి పోయింది. ప్రజలు సైతం వాటితో ఏకీభవిస్తూ రీ ట్వీట్లు చేస్తుండటంతో పరిస్థితి ప్రభుత్వానికి అర్థమైంది. ఉద్యమం ఆచరణాత్మకంగా, సులభంగా ఉంటే మాస్ మూవ్ మెంట్ గా తీర్చిదిద్దవచ్చని అర్థమైంది. భారీ కసరత్తులు, ధర్నాలు, రాస్తారోకోల హంగామా లేదు. అతిశయోక్తులు, ఆరోపణలు లేవు. ఉన్న వాస్తవాన్ని ఉచితరీతిలో ప్రదర్శించడమే ఈ విజయానికి కారణం.ముఖ్యంగా రాష్ట్రంలో 150 మంది వైసీపీ ఎమ్మెల్యేలున్నారు. వారికే జనసేన ఉద్యమ సెగ తగులుతోంది. తమ నియోజకవర్గాల్లో ఎస్.ఐ మొదలు అధికారుల వరకూ ఎవరుండాలో ఎమ్మెల్యేలే నిర్ణయిస్తున్నారు. కాంట్రాక్టులు ఎవరికి ఇవ్వాలో చెప్పేది వారే. తమ నియోజకవర్గాల్లో రోడ్ల పరిస్థితిని చూసుకోవాల్సింది కూడా వారే కదా. జనసేన ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తూ రోడ్ల దుస్థితిని ఫోకస్ చేయడం సరైన రాజకీయ నిర్ణయమే. ప్రజల్లో ఈ అంశము చర్చకు దారి తీస్తోంది. తమ అభిమాన నాయకుడు వస్తుంటే బ్యానర్లు, ఫ్లెక్సీలు పెట్టడం కంటే ప్రజల అవస్తలపై ఫ్లెక్సీలు పెట్టడం కచ్చితంగా మంచి పరిణామం. రాజకీయ పార్టీలు నేర్చుకోవాల్సిన గుణపాఠం. ఆందోళన అంటే రాస్తారోకోలు చేపట్టి, ప్రజలకు మరింత అసౌకర్యం కలిగించడం కాదు. ప్రజల చేత వారు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యపై దృష్టి పెట్టేలా చేసి, ఆలోచింప చేస్తే చాలు. ఇందుకు మొబైల్ ఫోన్ వంటి సాధారణ ఉపకరణాలు అందివచ్చాయి. పెద్ద ఉద్యమాలు సాగినప్పుడు అదంతా రాజకీయమంటూ కొట్టి పడేసిన ఎమ్మెల్యేలు జనసేన ఆందోళనపై నోరు మెదపలేకపోతున్నారు. వారంతా ఆత్మరక్షణలో పడ్డారు.అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల్లో ప్రభుత్వం రోడ్లపై పెట్టిన ఖర్చు నామమాత్రం. సాధారణంగా ప్రతి ఏడాది వేసవిలో రహదారుల మరమ్మతులు పూర్తి చేస్తుంటారు. 2020, 21 సంవత్సరాల్లో ఆ పనులు చేపట్టలేదు. దాంతో రాష్ట్రంలో అన్ని రహదారులు అధ్వాన్నస్థితికి చేరుకున్నాయి. పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులపై అదనపు రుసుం వసూలు చేసి మరీ నిధులు సమకూర్చుకున్నారు. కానీ ఆ నిధులను రోడ్లకు వెచ్చించడం లేదు. ఈ ఉదాసీనతే జనసేన రాజకీయ పోరాటానికి అవకాశమిచ్చింది. రాజకీయ అనుబంధాలు, వర్గాలకు అతీతంగా ప్రజలందరూ ఎదుర్కొంటున్న సమస్య. అందుకే జనసేన ఉద్యమం చేపట్టిన గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కార్యాలయానికి సమస్య తీవ్రత తెలియవచ్చింది. అధికారులతో సమీక్ష చేసి, వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మతులు చేయాలంటూ ఆదేశించారు. ఇదొక మంచి పరిణామమే. ప్రతిపక్షాలకు ఎటూ బలం లేదు కాబట్టి అనేక అంశాల్లో వారి ఆందోళనలను సీఎం సీరియస్ గా తీసుకోవడం లేదు. కానీ రోడ్ల అంశం ప్రజలలో అలజడిగా మారి, ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తుందని గ్రహించడంతో స్పందించాల్సి వచ్చింది. ఏదేమైనా వినూత్న రీతిలో ఆందోళన చేపట్టిన జనసేన క్యాడర్ ను పవన్ కల్యాణ్ ను, అదే సమయంలో తమ తప్పును గ్రహించి బుకాయించకుండా అంగీకరిస్తూ దిద్దుబాటుకు ప్రయత్నిస్తామన్న ముఖ్యమంత్రిని అభినందించాల్సిందే.

## శ్రీదేవికి తప్పని తిప్పలు

కర్నూలు, సెప్టెంబర్ 8 (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. 1994 నుంచి 2014 వరకు కూడా టీడీపీ ఓటమి ఎరుగని పార్టీగా దూసుకుపోయింది. ముఖ్యంగా ఇక్కడ ఎస్వి. సుబ్బారెడ్డి హ్యాట్రిక్ కొట్టగా ఆ తర్వాత ఇక్కడ కేఈ. ప్రభాకర్, కేఈ కృష్ణమూర్తి పార్టీ తరఫున ఇక్కడ నుంచి ప్రాతినిథ్యం వహించారు. 1994 నుంచి గత ఎన్నికల వరకు ఇక్కడ టీడీపీకి ఓటమి అనేదే లేదు. కేఈ సోదరులు బీసీలను ఇక్కడ పార్టీకి చేరువ చేశారు. అయితే, ఇప్పుడు అదే బీసీలకు వ్యతిరేకంగా రాజకీయాలు నడుస్తున్నాయనే వాదన బలంగా వినిపిస్తోంది. గత ఏడాది ఎన్నికల్లో ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా కంగాటి (చెరుకులపాడు) శ్రీదేవి విజయం సాధించారు. అయితే, దీనికి ముందు 2014లో చెరుకులపాడు నారాయణరెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి కేఈ చేతిలో ఓడిపోయారు.ఈ నేపథ్యంలోనే ఆయన జగన్ గూటికి చేరిపోయారు. వైసీపీ తరఫున గట్టి వాయిస్ వినిపించారు. జగన్ ఆయనకు నియోజకవర్గ బాధ్యతలు కూడా కట్టబెట్టారు. నారాయణరెడ్డి దూకుడుగా ముందుకు వెళుతూ కేఈకి చెక్ పెట్టేందుకు ప్రయత్నించారు. 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసినా కూడా ఆయనకు 31 వేల ఓట్లు వచ్చాయంటే ఆయనకు ఇక్కడ ఉన్న వ్యక్తిగత ఇమేజ్ ఉందో అర్థమవుతోంది. అయితే, ఏమైందో ఏమో నారాయణ రెడ్డి హత్యకు గురయ్యారు.ఈ విషయంలో కేఈ కృష్ణమూర్తి కుమారుడు శ్యాంబాబుపైనా కేసు నమోదైంది.నారాయణరెడ్డి మరణం తర్వాత ఈ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన వైసీపీఅధినేత జగన్.. 2019 ఎన్నికల్లో నారాయణరెడ్డి సతీమణి శ్రీదేవికి టికెట్ ఇస్తానని చెప్పారు. చెప్పినట్టే గత ఏడాది ఎన్నికల్లో ఆమెకు టికెట్ ఇచ్చారు. టీడీపీ తరఫున కేఈ శ్యాంబాబు గట్టిపోటీ ఇచ్చారు. అయినప్పటికీ.. దాదాపు 42 వేల ఓట్ల మెజారిటీతో శ్రీదేవిని ఇక్కడి ప్రజలు విజయం సాధించేలా చేశారు. రెడ్డిసామాజిక వర్గానికి చెందిన శ్రీదేవి.. ఎన్నికలకు ముందు అన్ని సామాజిక వర్గాలనుకలుపుకుని పోతానని హామీ ఇచ్చారు. కానీ, గెలిచిన తర్వాత సీన్ మారిపోయిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొత్తం బంధువులకే పెత్తనం అప్పగించారన్న విమర్శలు తీవ్రంగా వచ్చేశాయి.

శ్రీదేవి అలా గెలిచారో లేదో వెంటనే అల్లుళ్లతో పాటు బంధుగణం ఆమె చుట్టూ చేరిపోయి పెత్తనం చేస్తున్నారన్న టాక్ పత్తికొండలో వినిపిస్తోంది. ఆమె అల్లుళ్లు, బావ, బావ కొడుకు, ఈమె కుమారుడు వీరిదే పెత్తనం అనేలా ఉందని ఇక్కడి ప్రజలే చెప్పుకొంటున్నారు. కేఈ హయాంలో ఇక్కడి రెడ్లతో పాటు బీసీలకు ప్రాధాన్యం ఉండేది.ఇప్పుడు రెడ్లకే పెత్తనం ఇచ్చారనే భావన ఎక్కువగా వినిపిస్తోంది. పైగా శ్రీదేవిపై సొంత పార్టీలోనే నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పనిచేసిన నాయకులు అందరూ ఇప్పుడు శ్రీదేవి దగ్గర లేరని.. ఆమె బంధువులు, సొంత సామాజిక వర్గ నేతల హవానే నడుస్తోందని పార్టీ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు. నియోజకవర్గంలో బీసీలు, ఎస్సీలకు ప్రయార్టీ లేకుండా పోతోందన్న ఆవేదన పార్టీ నేతల్లో వచ్చేసింది. ఇక శ్రీదేవి సైలెంట్‌గానే ఉంటున్నా ఆమె చుట్టూ ఉన్న కోటరీతో ఆమెపై వ్యతిరేకత పెరిగిపోతోంది. ఇదే పరిస్థితి మరో రెండేళ్లు కొనసాగితే.. కేఈ శ్యాంబాబు పుంజుకునేందుకు పరోక్షంగా శ్రీదేవి సహకరించినట్టే అవుతుందని అంటున్నారు. మరి ఆమె మారతారో లేదో చూడాలి.

## కేపీ ఉల్లి పంటకు అరబ్ దేశాల్లో గిరాకీ

కడప, సెప్టెంబర్ 8 (న్యూస్ పల్స్) కృష్ణాపురం (కేపీ) ఉల్లి పంటకు అరబ్ దేశాల్లో గిరాకీ ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ పంటకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ కల్పించింది. దీంతో రైతులు, రైతు సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కడప పార్లమెంటు సభ్యు లు వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలుసార్లు కేపీ ఉల్లికి గుర్తింపు ఇవ్వాలని విన్నవించడంతోనే ఇది సాధ్యమైందని రైతులు అంటున్నారు. బ్రిటీష్ వైశ్రాయ్‌ల పరిపాలనా కాలంలో కేపీ ఉల్లి విదేశాలకు ఎగుమతి అవుతూ వస్తోంది. మద్దతు ధర కల్పించాలని, పంట కనుమరుగై పోకుండా కాపాడాలని రైతు సంఘాలు పోరాటాలు చేశాయి. అయినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో రైతుల కష్టాలను దగ్గ రగా చూశారు. కుదేలైన వ్యవసాయానికి జవసత్వాలు తీసుకురావాలని కంకణం కట్టుకున్నారు. కేపీ ఉల్లి పంటకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్) వచ్చేలా సహాయ సహకారాలు అందించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక విదేశీ ఎగుమతులకు ఢోకా ఉండదని, పంట పండినట్లేనని రైతులు అంటున్నారు. మైదుకూరు ప్రాంతం నుంచి కడపకు వచ్చే కేసీ కెనాల్ ద్వారా ఉల్లిగడ్డలు కడప సమీపంలోని కృష్ణాపురం రైల్వేస్టేషన్ వరకు పడవల ద్వారా రవాణా అయ్యేవని పెద్దలు సాహితీ వేత్త విద్వాన్ కట్టా నరసింహులు చెప్పారు. అక్కడి నుంచి నాటి మద్రాసు నేటి చెన్నై ఓడరేవు వరకు రైలులో వెళ్లేదన్నారు.అక్కడి నుంచి బ్రిటీషు వాళ్లు వారి దేశానికి ఎగుమతి చేసుకునే వారన్నారు. కేపీ ఉల్లిగడ్డలను మందులలో ముడి పదార్థంగా వాడతారని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.గత టీడీపీ ప్రభుత్వం పంట సాగు చేసిన రైతులను ఛీకొడుతూ వచ్చింది. ఎగుమతులు లేని పంటను ఎందుకు సాగు చేయాలని నాటి సీఎం, నేటి ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు అప్పట్లో తెగేసి చెప్పినట్లు రైతులు చర్చించుకుంటున్నారు.

బ్రిటీష్ వారి పరిపాలనా కాలం నుంచి కర్ణాటకలో మొదలై అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, ప్రకాశం జిల్లా మార్కాపురం వరకు ఈ పంట సాగవుతూ చిట్టిబళ్లారి, చిన్న బళ్లారి, రెడ్‌లేడీ, అగ్రిబ్రౌన్ రోజ్‌గా రూపాంతరం చెందింది. కేపీ ఉల్లిగా పేరు తెచ్చుకుని విస్తరించింది. రాయలసీమ జిల్లాల్లోని అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో లక్షల హెక్టార్లలో ఏటా సాగవుతూ ఉండేది. అయితే మన ప్రభుత్వాలు పంట దిగుబడిని ఎగుమతులు ఇవ్వకుండా మొండికేస్తూ వచ్చాయి. ధరలు పతనమవుతూ రావడంతో రైతులు పంట సాగు చేయడం తగ్గిస్తూ వచ్చారు. అయితే వైఎస్సార్ జిల్లాలోని మైదుకూరు కేంద్రంగా మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, బ్రహ్మంగారి మఠం, సింహాద్రిపురం, వీరపునాయునిపల్లె, కలసపాడు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాలు, కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని మండలాలు, ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలోని మండలాల్లో మాత్రమే సాగవుతోంది.

## చాకలిపేట స్కూలును పరిశీలించిన మంత్రి చెల్లుబోయిన

రామచంద్రాపురం రామచంద్రాపురం పట్టణంలోని చాకలిపేట హైస్కూల్ ను మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బుధవారం సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ నాడు-నేడు పనులు, విద్యా కానుక కిట్లు పంపిణీని పరిశీలించాను. జగనన్న గోరుముద్ద ద్వారా అందిస్తున్న భోజన సదుపాయాలను అకస్మిక తనిఖీ చేసాను. చాలా రుచికరమైన భోజనం అందిస్తున్నారు. నేను స్వయంగా తిని చూసాను. జగనన్న గోరు ముద్ద ద్వారా అందిస్తున్న భోజనం మా ఇంటి భోజనం కన్న గొప్పగా ఉందని విద్యార్థులు చెప్పుతుంటే చాలా సంతోషం కలిగించింది. బాబా సాహెబ్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే, మహాత్మ గాంధీ ఆశయం ఒక్కటే విద్యతో పేదరిక నిర్మూలన జరుగుతుంది. ఆ ఆశయ సాధన దిశగా సీఎం జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కార్యక్రమాలు నిదర్శనం. ఎదో ఒక్క సమస్య సృష్టించి ఆ సమస్యతో ప్రజలు మభ్యపెట్టాలని ప్రతిపక్ష పార్టీలు చూస్తున్నాయి. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. మీకు అధికారం ఇస్తే ఏమి చేసారు? మీకు అధికారం పోయిందని ఆ అధికారం కోసం సంక్షేమ పాలకుడు పాలనను ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అధికారమే మీ లక్ష్యం... పేదవాడి అభివృద్ధి సీఎం లక్ష్యం. గత ప్రభుత్వం నాణ్యత లోపంతోనే నేడు రోడ్లకు ఈ పరిస్థితి. మూడు సంవత్సరాలలో మీరు నిర్మించిన రోడ్లు నాణ్యత లోపంతో గుంతలు ఏర్పాడాయి. మీ నాణ్యత లోపంతో ఏర్పడిన గుంతలను బాగు చేసి మంచి రోడ్లను ఏర్పాటు చేసేందుకు రోడ్డు మ్యాప్ సీఎం సిద్దం చేశారు. మీరు చేసిన అవకతవకలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు దాదాపుగా 5 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి రోడ్లను మరమ్మత్తు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## పథకం పరిధిలోకి విష జ్వరాలు

విశాఖపట్నం రాష్ట్రంలో అమలవుతున్న ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి విష జ్వరాలను సీఎం జగన్ చేర్చారని వైద్య ఆరో గ్య శాఖ మంత్రి ఆళ్ల నాని తెలిపారు. విశాఖ జిల్లాలో 462 డెంగ్యూ, 31 చికెన్ గున్యా, 708 మలేరియా కేసులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నా రు. ఈ సంఖ్య ఇంకా పెరగకుండా, ప్రజలు చికిత్స పరంగా ఇబ్బంది పడ కుండా చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ ఆదేశించారని నాని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో విషజ్వరాలు ఎక్కు వగా నమోదవుతున్నందున దగ్గర అధికార యంత్రాంగం పూర్తిగా అప్రమ త్తం అయిందన్నారు. ఎక్కువ కేసులు ఉన్నచోట స్పెషల్ శానిటేషన్ డ్రైవ్, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విష జ్వరాలను గుర్తించడానికి రెగ్యు లర్గా సర్వే జరుగుతుందన్నారు. టెస్ట్ ఎక్విప్ మెంట్, మందులు సిద్దం గా ఉంచాలని అధికారులకు చెప్పామ న్నారు. మిగతా జిల్లాల కంటే విశాఖ జిల్లాలో విషజ్వరాలు కాస్త ఎక్కువగా ఉన్నాయని మంత్రి ఆళ్ల నాని పేర్కొన్నారు.




## జగన్ కు కమలం చిక్కులు

విజయవాడ, సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)ఏపీలో బీజేపీది అక్షరాలా అస్తిత్వ పోరాటమే. వచ్చే ఎన్నికల్లో ఎన్ని సీట్లు వస్తాయి అన్న దాని కంటే కూడా ఎన్ని ఓట్లు ఎక్కువ తెచ్చుకోవాలి అన్న ఆరాటమే వారిది. ఇవాళ రేపట్లో ముఖ్యమంత్రి అయిపోవాలన్న ఆశలు అసలు లేవు. ఆంధ్రా రాజకీయాల విషయంలో వారికి స్పష్టమైన అవగాహన అయితే ఉంది. అలా తమ పని ఏదో చేసుకుపోతున్న కమలనాథులతో జగన్ పరాచికాలు ఆడుతున్నారు. వారిని గిల్లి గిచ్చి వీధులలోకి రప్పిస్తున్నాడు. పాపం జగన్నాటకంలో తాము పాత్రధారులమో సూత్రధారులమో తెలియక కాషాయదారులు కారాలూ మిరియాలూ తెగ నూరుతున్నారు. జగన్ మీద ఆవేశపడిపోతున్నారు. అసలు ఇంతకీ జగన్ కి ఏం కావాలి, కమలనాథులకు ఏం కావాలి అన్నదే ఎవరికి అర్థం కాని విషయం.కమలనాథులు ఆ కార్డుని ఎపుడో వాడేసారు. దాని వల్ల పైసా కూడా లాభం లేదని కూడా తెలుసుకున్నారు. కానీ పదే పదే అదే కార్డు వాడాల్సివస్తోంది. ఏపీ సర్కార్ హిందువులకు అన్యాయం చేస్తోందని బీజేపీ నేతలు అంతగా అరచి గోల చేసినా వర్కౌట్ కాదు, జగన్ కి కూడా ఆ సంగతి తెలుసు. అందుకే ఆయన బీజేపీని కవ్విస్తున్నారులా ఉంది. లేకపోతే వినాయక చవితి ఉత్సవాలకు కూడా షరతులు పెట్టారన్న చెడ్డ పేరు ఎందుకు తెచ్చుకోవడం అన్నదే రాజకీయం తెలిసిన వారి మాట. దీని వల్ల జగన్ కి తటస్థంగా ఉన్న వారిలో కొంత వ్యతిరేకత తప్ప మరేమీ ఒనకూడేది లేదు. ఇంకో వైపు ఇది బీజేపీకి కాకపోయినా టీడీపీకి రాజకీయంగా లాభం చేకూరుస్తుంది. మరి జగన్ కి ఈ సంగతి తెలియదు అనుకోగలరా. జగన్ వ్యక్తిగతంగా క్రిస్టియన్ మతాన్ని ఆరాధిస్తారు. దాంతో బీజేపీ లాంటి పార్టీలు చేసే ప్రతి చిన్న ఆరోపణ అతి పెద్ద వివాదం అవుతోంది. అసలే పాలనాపరమైన ఇబ్బందులు ఉన్న వేళ ఈ కొత్త తగవులు ఎవరూ కోరుకోరు. కానీ జగన్ మాత్రం ఢీ కొడుతూనే ఉన్నారు. అది దేవతా విగ్రహాల కూలగొట్టడం నుంచి మొదలై టిప్పు సుల్తాన్ విగ్రహావిష్కరణ దాకా సాగి ఇపుడు చవితి ఉత్సవాల దాకా వచ్చేసింది.ఒకటి ఎపుడూ ఒంటరి అంకె. అయితే దాని పక్కన సున్నా చేరిస్తే చాలు పదింతలు విలువ పెరుగుతుంది. అలాగే బీజేపీ తో పెట్టుకుంటే ఏంటి అనుకోవచ్చు. కానీ రేపు ఇదే బీజేపీ టీడీపీతో జట్టు కడితే జగన్ పరాచికాలు కాస్తా రాజకీయ చికాకులుగా మారిపోతాయి. అందువల్ల బీజేపీతో ఎరిగి మరచి పెట్టుకోకూడదనే రాజకీయ నీతి. అలా పెట్టుకుని అపర చాణక్యుడు చంద్రబాబు ఏమయ్యారన్నది కూడా కళ్ళ ముందున్న చరిత్రే మరి.తెలంగాణా బీజేపీకి బోలెడు పని ఉంది. అదే ఏపీలో మాత్రం ఫుల్ ఖాళీ. అలాంటిది జగన్ పుణ్యమాని బీజేపీకి కూడా మంచి పని దొరికింది. సోము వీర్రాజు కూడా వీరుడైపోతున్నారు. కాసుకో జగన్ అంటున్నారు. అరెస్టులు, నిరసనలు ఇలా బీజేపీ హడావుడి ఒక్కలా లేదు మరి. ఈ పుణ్యమంతా జగన్ దే మరి. ఫలితం మాత్రం అచ్చంగా చంద్రబాబుదైతే ఆశ్చర్యం లేదుగా.

# ఒక్క ఓటమితో తటస్థులుగా మారిపోయిన జేసీ బ్రదర్స్

అనంతపురం, సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)వారంతా రాజకీయంగా సీనియర్లు. కొన్ని దశాబ్దాలుగా రాజకీయాల్లో చక్రం తిప్పుతున్నారు. అయితే.. రాష్ట్ర విభజనతో అడ్రస్ గల్లంతవుతుందని అనుకుంటున్న సమయంలో టీడీపీ సైకిల్ ఎక్కారు. దీంతో ఇంకే ముంది.. వీరివల్ల పార్టీ పుంజుకుంటుంది.. వచ్చే 30 ఏళ్లపాటు పార్టీ అధికారంలోనే కొనసాగుతుందని.. భావించిన చంద్రబాబు.. ఇలా వచ్చిన వారికి పదవులు ఇచ్చారు. ప్రాధాన్యం పెంచారు. వారు అడిగిందే తడవుగా వారి కోరికలు కూడా తీర్చారు. కానీ, తీరా చూసుకుంటే.. ఒక్క ఓటమితో.. వీరంతా పార్టీలో తటస్థులుగా మారిపోయారు. ఉన్నారు అనే పేరుకు ఉన్నప్పటికీ.. పార్టీ కోసం.. అటు పుల్ల తీసి ఇటు వేయడం కూడా చేయడం లేదు.దీంతో ఇప్పుడు ఇలాంటివారిని వదిలించుకుంటారా ? లేదా ? అనే డిమాండ్లు.. టీడీపీలో అంతర్గతంగా వినిపిస్తున్నాయి. విషయంలోకివెళ్తే.. అనంతపురం జిల్లాను తీసుకుంటే.. జేసీ దివాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి సోదరులు రాష్ట్ర విభజన తర్వాత.. టీడీపీలోకి వచ్చారు. అనంత ఎంపీ.. తాడిపత్రి ఎమ్మెల్యే టికెట్లు తెచ్చుకుని 2014లో గెలుపుగుర్రం ఎక్కారు. తర్వాత.. వారి వ్యాపారాలను డెవలప్ చేసుకున్నారు. గత ఎన్నికల్లో పట్టుబట్టి వారసులకు టికెట్లు ఇప్పించుకున్నారు. కానీ, ఓటమి తర్వాత.. పార్టీకి ఎలాంటి ప్రయోజనం వీరివల్ల కలగడం లేదు. పైగా దివాకర్ రెడ్డి పూర్తిగా న్యూట్రల్ అయిపోయారనే వాదన ఉంది. ఇక, తాడిపత్రి స్థానిక ఎన్నికల నుంచి విజయం దక్కించుకున్న ప్రభాకర్.. కనీసం మాట మాత్రంగా అయినా.. టీడీపీ వల్ల గెలిచానని చెప్పుకొనేందుకు ఇష్టపడడం లేదు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. మరి వీరి వల్ల ప్రయోజనం ఏంటని నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇక, కర్నూలు జిల్లాకు చెందిన కోట్ల కుటుంబం పరిస్థితి కూడా ఇలానే ఉంది. కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఆయన సతీమణి సుజాతమ్మలు గత ఎన్నికలకు ముందు టీడీపీ పంచన చేరి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు తెచ్చుకున్నారు. కానీ, ఓడిపోయారు. ఇక, అప్పటి నుంచి న్యూట్రల్ అయ్యారు. మరి వీరిని కొనసాగిస్తారా? వదులుకుంటారా? తేల్చాలంటూ.. పార్టీలో చర్చ సాగుతోంది. ఇక, విజయవాడకు చెందిన యువ నాయకుడు, కాపు సామాజిక వర్గానికి చెందిన నేత వంగవీటి రాధాను చంద్రబాబు ఎన్నికలకు ముందు టీడీపీలో చేర్చుకున్నారు. ఆయన పరిస్థితి కూడా ఇప్పుడు ఇలానే ఉంది. ఆయనను కూడా పార్టీలో కొనసాగిస్తారా ? పక్కకు తప్పిస్తారా ? అనేది చర్చగా మారింది. పైగా రాధా పార్టీ కోసం చేస్తోంది అయితే ఏం లేదు. ఇక గత ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన అవుట్ డేటెడ్ లీడర్లు పనబాక లక్ష్మి, వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ లాంటి వాళ్లను ఇంకా నమ్ముకుని పదే పదే ఎందుకు ఛాన్సులు ఇస్తారన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.ఒక్క ఈ జిల్లాలే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది నేతలు...టీడీపీలో తటస్థులుగా ఉన్నారు. వీరివల్ల టీడీపీకి ప్రయోజనం లేకపోగా.. అంతర్గత కలహాలు పెరుగుతున్నాయని అంటున్నారు సీనియర్లు. ఈ నేపథ్యంలో ఏం చేయాలనేది.. చంద్రబాబుకు ఇబ్బందికరంగా మారింది. వారంతట వారు పోరు.. పొమ్మని చంద్రబాబు చెప్పలేరు. వెరసి.. పార్టీ మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం.

# రూట్ మార్చిన జనసేన

విజయవాడ, సెప్టెంబర్ 9, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో అడక్కుండానే బిజెపి చెంతన చేరి పొత్తు పెట్టుకున్నారు జనసేనాని పవన్ కళ్యాణ్. అయితే ఆయన అనుకున్నది ఒకటి అయింది, అవుతుంది మరొకటి. అమరావతి నుంచి, స్టీల్ ప్లాంట్ వరకు కేంద్రంలోని బిజెపి వేస్తున్న అడుగులు జనసేనకు ఉన్న ఓటు బ్యాంక్ కి చిల్లు పడేలాగే నిర్ణయాలు సాగుతున్నాయి. దాంతో తమ దారి తాము చూసుకోవడానికి మంచి ముహూర్తాన్ని పవన్ కళ్యాణ్ చూసుకుంటున్నట్లు పొలిటికల్ టాక్. వచ్చే ఎన్నికల నాటికి టిడిపి తో పొత్తు పెట్టుకునే రంగంలోకి దిగాలని దీనికి బిజెపి కలిసి వచ్చినా లేకపోయినా వ్యూహాత్మకంగా సాగాలన్న ఎత్తుగడలో జనసేనాని పవన్ కళ్యాణ్ ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే అనేక కార్యక్రమాల్లో బిజెపి తో జనసేన ఎడమొహం పెడమొహం గానే సాగుతుంది. తిరుపతి పార్లమెంట్ ఎన్నికల తరువాత కమలానికి, జనసేనకు దూరం మరింత పెరిగిందనే అంటున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయకుండా ఇకపై రాజకీయం చేయలేమన్నది పవన్ కళ్యాణ్ కి అనుభవంతో అర్ధమైంది. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీతో జతకట్టేవారు ఎవరైనా జనసేనకు పట్టున్న ప్రాంతాల్లో సీట్లు వదిలేసేలా డిమాండ్ పెట్టాలని లిస్ట్ సైతం సిద్ధం చేస్తున్నారని అంటున్నారు. దీనికోసం ఇప్పటి నుంచి కసరత్తు మొదలు పెట్టింది కవాతు పార్టీ. అందుకే జిల్లాల వారీగా అన్ని ప్రాంతాలతో కమిటీలు వేయడం వేగంగా పూర్తి చేస్తుంది జనసేన. కీలకమైన స్థానాలు, నమ్ముకున్న పార్టీలోని నేతలకు న్యాయం జరిగేలా కొందరికి టికెట్ పై హామీ కూడా పవన్ కళ్యాణ్ ఇచ్చేశారని అంటున్నారు.నాయకులు, క్యాడర్ పనితనాన్ని బట్టి వారికి అన్ని విధాలా పదోన్నతులు ఇవ్వాలని అధినేత పవన్ కళ్యాణ్ భావిస్తున్నారని చెబుతున్నారు. కొందరిని ఆయా నియోజకవర్గాల్లో పనిచేసుకోవాలని ఇప్పటికే చెప్పారని తెలుస్తుంది. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాయలసీమ లోని కొన్ని నియోజవర్గాలు ఉత్తరాంధ్ర లో తమకు పట్టున్న ప్రాంతాలపై జనసేన ఫోకస్ పెంచినట్లు సమాచారం. కనీసం వచ్చే ఎన్నికల లోగా 50 స్థానాల్లో గట్టి పట్టు సాధించాలన్నది ఆ పార్టీ వ్యూహంగా ఉంది. తద్వారా ప్రభుత్వ ఏర్పాటులో కీలకం అవుతామని పార్టీని బతికించుకునే అవకాశాలు ఉంటాయని ఆ పార్టీ ఆలోచన అంటున్నారు రాజకీయ నిపుణులు. ప్రజా సమస్యలపై ఇక మీదట చురుగ్గా ఉద్యమించే క్యాడర్ ను ప్రోత్సహిస్తూ వారిలో జోష్ పెంచడానికి అధిష్టానం చర్యలు మొదలు పెట్టింది. రాబోయే సార్వత్రిక ఎన్నికల యుద్ధం నాటికి పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలన్న జనసేన కలలు ఏమేరకు నెరవేరతాయో చూడాలి.

# తమ్మిలేరు కు వరద ముప్పు.... అప్రమత్తమైన అధికారులు

ఏలూరు సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)తెలంగాణా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు సత్తుపల్లి మండలం బెతుప ల్లి చెరువులోకి 10వేల క్యూసెక్కులు నీరు చరటంతో తమ్మిలేరులో కి 3000 క్యూసెక్కులనీరు విడుదల చేసారు. దాంతో ఏలూరులోని తమ్మిలేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ అర్ధరాత్రి ఏలూరు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఏలూరు అమినా పేటలోని లోబ్రిడ్జిని పోలీసులు తాత్కాలికంగా మూసి వేశారు.

# సోడా గ్యాస్ పేలి వ్యక్తికి గాయాలు

కాకినాడ సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)ప్రమాదవశాత్తు సోడా గ్యాస్ సిలిండర్ పేలడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలై న సంఘటన తూర్పు గోదావరి జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో చోటు చేసుకుంది. మండపేట రూరల్ ఎస్.ఐ బళ్ల శివ కృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం టాటా ఏస్ వాహనంలో సోడా గ్యాస్ సిలిండర్ లను తీసుకువస్తుండగా ద్వారపూడి పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు సిలిండర్ పేలిపోయింది. దీంతో వాహనం వెనుక వస్తున్న మోటార్ సైక్లిస్ట్ తలకు తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రుడిని పోలీస్ జీపులో అనపర్తి తరలించారు. కాగా టాటా ఏస్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

# వినాయకుని పండుగలకు కోవిండ్ నిబంధనలా.....

కడప సెప్టెంబర్08 :కడప నగరంలోని కోపరేటివ్ కాలనీలో గల తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వి.యస్.అమీర్ బాబు తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గారికి బహిరంగ లేఖను విడుదల చేసిన అమీర్ బాబు గారు. ఈ కార్యక్రమంలో సానపురెడ్డి శివ కొండారెడ్డి నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జలతోటి జయకుమార్ నగర ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల శివరాం, అధికార ప్రతినిధి అము?రి బాలదాసు, సి ఎస్ నాసర్ అలీ, నబి కోట్ శ్రీనివాసులు, గంగాధర్ యాదవ్, చాంద్ భాషా, తదితరులు పాల్గొన్నారు...

# శివప్రసాద్ రెడ్డికి దారెటు...

కడప, సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)ఏపీ సీఎం జగన్ తన సొంత జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు క్రమక్రమంగా ఎర్త్ పెట్టేస్తూ వస్తున్నారా ? పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే లెక్కలేని తనంగా వ్యవహరిస్తోన్న సదరు ఎమ్మెల్యేకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కూడా ఇచ్చే ఛాన్సులు లేవా ? అంటే కడప జిల్లా వైసీపీలో ఇప్పుడు అవును అన్న మాటే వినిపిస్తోంది. సదరు ఎమ్మెల్యే ఎవరో కాదు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి. పార్టీ ఓడిన 2014 ఎన్నికల్లో గెలిచిన ఆయన గత ఎన్నికల్లోనూ మరోసారి విజయం సాధించారు. గత ఎన్నికల్లో గెలిచాక శివప్రసాద్ రెడ్డి దూకుడు వైఖరి కారణంగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఆయనకు మైనస్ మార్కులు పడడంతో పాటు పార్టీ ప్రతిష్ట సైతం మసకబారుతూ వస్తోంది.కొద్ది నెలల క్రితం టీడీపీకి చెందిన ఓ బీసీ నేత హత్య విషయంలో ఎమ్మెల్యే ప్రమేయంపై తీవ్రమైన విమర్శలు రావడంతో చివరకు ఈ విషయాన్ని టీడీపీ రాష్ట్ర స్థాయిలో హైలెట్ చేయడంతో జిల్లాలో వైసీపీ నేతలు బీసీలను దారుణంగా అణగదొక్కడంతో పాటు చివరకు చంపేయిస్తున్నారన్న విమర్శలు తీవ్రంగా వచ్చాయి. అనంతరం నామినేటెడ్ పదవుల విషయంలో రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సిఫార్సులను జగన్ పూర్తిగా పక్కన పెట్టేశారు. 2014 ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసీపీ నుంచి గెలిచిన నేతలకు, ఎమ్మెల్యేకు అప్పుడే పడేది కాదు? ఇక ఇప్పుడు అదే పరిస్థితి ఉంటుందనే జగన్ ఆయన చెప్పిన వారికి పదవులు ఇవ్వలేదు.అన్నింటికి మించి ఆయనకు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ రూపంలో బిగ్ షాక్ తగిలింది. అదే నియోజకవర్గానికి చెందిన బీసీ నేత రమేష్ యాదవ్‌ను జగన్ ఎమ్మెల్సీని చేశారు. అప్పుడు రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదట. అప్పటి నుంచి రమేష్ యాదవ్‌ను నియోజకవర్గంలో అణగదొక్కేందుకు రాచమల్లు చేస్తోన్న ప్రయత్నాలు కూడా అధిష్టానం దృష్టికి వెళ్లడం పై నుంచి వార్నింగులు రావడం జరుగుతున్నాయట. జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా బీసీలకు ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ప్రొద్దుటూరులో బీసీ కోటాలో కూడా రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి జగన్ చెక్ పెట్టేస్తారనే అంటున్నారు.ఇక తాజాగా ఆయనకు చెప్పకుండానే ఆయన నియోజకవర్గంలో అధికారుల బదిలీలు జరిగిపోతున్నాయి. కొద్ది రోజుల క్రితం ఓ పోలీస్ అధికారిని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పట్టుబట్టిబదిలీ చేయించారు. ఇదంతా రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి తెలియదు.ఉన్నత నేతలఅండతోనే రమేష్ యాదవ్ ఆ అధికారిని బదిలీ చేయించారు. ఇక ఇప్పుడు ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రాధను సైతం ఎమ్మెల్యేకు తెలియకుండానే బదిలీ చేసి పడేశారు.ఎమ్మెల్యే అండతో ఆమె చాలా ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న అపవాదు ఉంది. చివరకు ఆమె తీరుపై వైసీపీ కౌన్సెలర్లు సైతం రగిలిపోయారు. ఆమె పార్టీ కార్యకర్తగా వ్యవహరించారన్న విమర్శలు ఎదుర్కొన్నారు. ఆమె బదిలీ కూడా ఎమ్మెల్యేకు తెలియకుండానే జరిగిపోయిందంటున్నారు. ఏదేమైనా ప్రతి విషయంలోనూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డిని కట్టడి చేసే ప్రక్రియ అయితే సొంత పార్టీలోనే జరుగుతోందన్నది వాస్తవం..?

# ధర్మాన కు స్పీకర్ పదవి...?



శ్రీకాకుళం, సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్)ఏపీ రాజకీయాలు కొత్త మలుపు తిరగనున్నాయి. దానికి మంత్రి వర్గ విస్తరణ నాంది కాబోతోంది. ఇంతకాలం సైలెంట్ గా ఉన్న వైసీపీ రాజకీయం గేర్ మార్చేందుకు ఈ విస్తరణే మార్గం అవుతుంది అంటున్నారు. ఇదిలా ఉంటే ఉత్తరాంధ్రా జిల్లాల్లో వెనకబడిన శ్రీకాకుళం జిల్లాలో మంత్రి వర్గ విస్తరణ వల్ల ఎవరికి మేలు, ఎవరికి చేటు అన్న ప్రశ్న ఒకటి తలెత్తుతోంది. శ్రీకాకుళం జిల్లాలో సీనియర్ మోస్ట్ నేతగా ధర్మాన ప్రసాదరావు ఉన్నారు. ఆయనను వైఎస్సార్ ఎంతో గౌరవించి ఆదరించారు. జగన్ మాత్రం పక్కన పెట్టారు. అయితే విస్తరణలో తమ నాయకుడికి మంత్రి పదవి ఖాయమని ఒక వైపు ధర్మాన ప్రసాదరావు అనుచరులు హల్ చల్ చేస్తున్నారు. కానీ వైసీపీ వర్గాల సమాచారం ప్రకారం చూస్తే ధర్మానకు మంత్రి పదవి ఈసారి కూడా ఇవ్వరు అంటున్నారు.ధర్మాన ప్రసాదరావు సీనియర్ లీడర్ కాబట్టి ఆయన్ని గౌరవించి రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని అప్పగిస్తారు అంటున్నారు. శాసనసభను సమర్ధంగా నిర్వహించే సత్తా ఆయనకే ఉందని కూడా జగన్ నమ్ముతున్నారుట. దీని వల్ల ఆయనకు ఆ కీలకమైన పదవి ఇస్తే న్యాయం చేసినట్లు ఉంటుంది, క్యాబినెట్ లో తీసుకోకుండానే తగిన హోదా ఇచ్చినట్లు ఉంటుందని జగన్ కొత్త ఆలోచన చేస్తున్నారుట. అలాగే ఇదే జిల్లాకు మరోసారి స్పీకర్ పదవి కట్టబెట్టి గుర్తింపు ఇచ్చామని చెప్పుకోవడానికి కూడా వీలు అవుతుందని కూడా భావిస్తున్నారుట. మొత్తానికి జగన్ ఆలోచనల మేరకు ధర్మాన ప్రసాదరావుకు పదవి దక్కుతుంది కానీ అది మంత్రి పదవి కాదు అనే ప్రచారం సాగుతోంది.ఇక శ్రీకాకుళం రాజకీయాలలో తలపండిన తమ్మినేని సీతారాం ని క్యాబినేట్ లో తీసుకుంటారని అంటున్నారు. తనకు లాస్ట్ చాన్స్ అని ఆయన జగన్ వద్ద మొర పెట్టుకున్నారు. దానికి కరిగిన జగన్ పెద్దాయనను మంత్రిని చేయాలని, తద్వారా శ్రీకాకుళం జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్న కాళింగులకు న్యాయం చేయాలని నిర్ణయించారని చెబుతున్నారు. ఆయన కోసమే జగన్ మార్పులు చేర్పులు కూడా ఇదే జిల్లాలో పెద్ద ఎత్తున చేస్తున్నారు అని కూడా చెబుతున్నారు. ఇదే జిల్లాలో ఉన్న బీసీ మంత్రి సీదరి అప్పలరాజుని తప్పించి తమ్మినేని కి మంత్రి కిరీటం పెడతారు అని అంటున్నారు. ఒక విధంగా ఈ సమీకరణల వల్ల బీసీలకు, ధర్మాన ప్రసాదరావు ఫ్యామిలీకి న్యాయం చేస్తున్నామని జగన్ సందేశం ఇస్తారరట.ఇక ధర్మాన క్రిష్ణ దాస్ ని మంత్రి పదవి నుంచి తప్పించడం కూడా ఖాయమే అంటున్నారు. ఎందుకంటే తమ్ముడికి అన్నకీ కూడా పదవులు ఇవ్వరు కాబట్టి. కానీ ఉప ముఖ్యమంత్రి లాంటి కీలకమైన స్థానంలో ఉన్న క్రిష్ణ దాస్ ని తప్పిస్తే ధర్మాన ప్రసాదరావుకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అన్న డిమాండ్ వస్తోంది. కేవలం రాజ్యంగబద్ధ పదవి అయిన స్పీకర్ కుర్చీలో ప్రసాదరావుని కూర్చోబెట్టి జిల్లా రాజకీయాన్ని అంతా తమ్మినేనికి అప్పగిస్తే మాత్రం వచ్చే ఎన్నికల్లో సీన్ రివర్స్ అవుతుందని వైసీపీ లో ధర్మాన వర్గం హెచ్చరిస్తోంది. ఇక ధర్మాన ప్రసాదరావు కూడా తీసుకుంటే మంత్రి పదవి లేకుంటే లేదు అన్నట్లుగా ఉంటారా, లేక జగన్ చెప్పినట్లుగా స్పీకర్ కుర్చీలో ఆసీనులు అవుతారా అన్నది కూడా చూడాలి.

# సిలికా సాండ్ డీలర్ల వ్యాపారాభివృద్ధికి సహకారం అందించాలి

## సిలికా సాండ్ డీలర్స్ అసోసియేషన్

నెల్లూరు సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్) అక్రమంగా సిలికా మైనింగ్ డంపింగ్ యార్డ్ లపై దృష్టి పెట్టి వాటిని అరికట్టి, సిలికా సాండ్ డీలర్ల వ్యాపార అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర శాసన మండలి సభ్యులు బల్లికళ్యాణ్ చక్రవర్తిని, సిలికా సాండ్ డీలర్స్ అసోసియేషన్ వారు వినతిపత్రం అందజేసి కోరారు, నెల్లూరు నగరంలోని ఆర్‌డ బి అతిథి గృహంలోరాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తిని కలిసిన సిలికా సాండ్ డీలర్స్ అసోసియేషన్ వారు మర్యాద పూర్వకంగా కలసి సిలికా వ్యాపారులు, అక్రమ మైనింగ్ లపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగాసిలికా సాండ్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ,ది గూడూరు సిలికా సాండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించి 200 మంది డీలర్లు,5వేల మంది వ్యాపారస్తులు 20 ఏళ్లుగా క్రమ పద్ధతిలో వ్యాపారం చేసుకుంటూ, జీవిస్తున్నాం అని తెలిపారు. గతంలో సిలికా ఓనర్ల దగ్గర కొనుగోలు చేసి వ్యాపారం చేసే వాళ్ళం అనీ, ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ వ్యవస్థ లో మార్పులు తీసుకొని వచ్చి టెండర్లు ద్వారా ఓ సంస్థ కు క్రయ విక్రయాల చేసుకొనేందుకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది అని వారు తెలిపారు.సదరు ఆ సంస్థ అవంతిక దగ్గర గతంలో లాగేనే సిలికా సాండ్ కొనుగోలు చేసి వ్యాపారం చేసుకుంటున్నాం అని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంస్థ చిన్న డీలర్ల సౌకర్యార్థం సొంతంగా డంపింగ్ యార్డ్ చేసి డీలర్ల వ్యాపారం కొరకు అన్నీ విధాల సహకరిస్తున్నారు అని వారు తెలిపారు,ఈ సంస్థ వచ్చినప్పటి నుండి చిన్న,పెద్ద తేడా లేకుండా అందరికి సమాన పద్దతిలో ఒకే రేటుకి విక్రయిస్తున్నారు అన్నారు.,అందువలన ప్రతి ఒక్క వ్యాపారి ప్రశాంతంగా ఉన్నారు అని తెలియజేశారు.అంతేకాకుండా ఈ సంస్థ వచ్చినప్పటి నుండి ఎటువంటి అక్రమ సిలికా సాండ్ కు చోటు ఇవ్వకుండా వ్యవహరిస్తూ వ్యాపారాలు సజావుగా సాగుతోంది అని వారు తెలిపారు.ఈ పద్ధతులు నచ్చని అక్రమ సిలికా రవాణా కు అలవాటు పడిన కొంతమంది డీలర్లు మా అసోసియేషన్ ను అడ్డు పెట్టుకొని గత కొంత కాలం గా అవంతిక సంస్థ మిందా అధిక ధరలు,స్థానిక ఉపాధి,స్థానిక రవాణా అని అసత్య ప్రచారాలు చేస్తునట్లు వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.వీరి వలన రాష్ట్ర ప్రభుత్వానికి అప్రతిష్ట తెస్తున్నారు అనీ,అంతటితో ఆగకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులకు తప్పుడు పిర్యాదులు చేస్తున్నారు అనీ ఈ పద్ధతి సమంజసమా అని వారు ప్రశ్నించారు.ఈ చర్యలకు తమ అసోసియేషన్ కు ఎటువంటి సంబంధం లేదు అన్నారు. దీనికి కారణాలు అనంతిక సంస్థ కు 5 కిలో మీటర్ల జోన్ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డు లకు సిలికా ఇవ్వకపోవడమే ప్రధాన కారణం అన్నారు. ఒక వేళ అనుమతులు ఇచ్చిన అక్రమ సిలికా తరలింపు వ్యాపారం జరుగుతుంది అని వారు ఆరోపించారు.దీని వలన ప్రభుత్వ ఖజానాకు గండి పడడమే కాకుండా నిజాయితీగా వ్యాపారం చేసుకుంటున్న డీలర్లు సైతం నష్ట పోతారు అని వారు ఆవేదన వ్యక్తంచేశారు.ఇప్పటికే న్యాయ బద్దంగా మైనింగ్ జోన్ లో వ్యాపారం చేసుకొనే డీలర్లు మైనింగ్ జోన్ బయట ప్రదేశానికి మార్చుకున్నారు అని తెలిపారు.

ఇది కంటిగింపుగా మారిన కొంత మంది డీలర్లు అయినా మదన్,శంఖర్ రెడ్డి, శంఖర్,మురళి, నవిన్, సురేష్ మొదలగు వ్యక్తులు ఆరోపించిన విధంగా వ్యాపారం తగ్గుటకు, సిలికా ధరలు పెరిగేందుకు కారణం కాదు అన్నారు.వ్యాపార క్షిణితకు కారణం పెరిగిన డీజిల్ ధరలు కారణంగా టన్ను 500 రూపాయలు 600 రూపాయల వరకు రవాణా ఛార్జీలు పెరిడం అసలు కారణం అన్నారు.కరోనా విపత్కర పరిస్థితుల్లో దక్షిణ,ఉత్తర భారతదేశంలో గల పౌనీడరీల్స సిలికా వాడకం తగ్గడం కూడా వ్యాపార క్షిణిత కు మరో కారణం అని తెలిపారు.అదేవిధంగా అన్నీ గ్రేడులలో సిలికా లభ్యత లేకపోవడం మరో కారణం అన్నారు.అంతేకాని తమ అసోసియేషన్ కు గాని పైన పేర్కొన్న వ్యక్తులకు ఎటువంటి సంబంధం లేదు అని వారు వెల్లడించారు.ఈ విషయాలు అన్ని రాష్ట్ర శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి దృష్టికి తీసుకెళ్లి అవంతిక సంస్థకు ఎక్కువ మైనింగ్ లు కేటాయించి అన్నీ గ్రేడ్ సిలికాను అందుబాటులో ఉంచి ప్రభుత్వ ఆదాయానికి మరియు డీలర్ల వ్యాపారానికి సహకరించాలి అని కోరడం జరిగిందని వారు తెలిపారు. ఎమ్మెల్సీ ని కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్, వైస్ చైర్మన్ ముంజునాధ్ రెడ్డి, కళ్యాణ్ రెడ్డి, సతీష్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# చట్టం సామాన్యులకేనా పెద్దలకు వర్తించదా.?

## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖుతుబొద్దిన్ పాషా

కోరుట్ల సెప్టెంబర్ 08 మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణాల అనుమతుల కోసం సామాన్యుల కు ఒక చట్టం రాజకీయ అండ దండలు ఉన్న పెద్దలకు ఒక చట్టం అమలు చేస్తున్నారా అని మెట్ పెల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబోద్దిన్ పాషా. కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీఅధ్యక్షుడు రామ్ ప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సామాన్య ప్రజలు భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే ఏదో ఒక లోపం చూయించి పనులను నిలిపి వేయడం మరియు కూల్చడం లాంటి చర్యలకు పాల్పడుతున్న మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకుల అండదండలు ఉన్న పెద్దలు ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న పనులు ఎందుకు నిలిపివేయడం లేదో వాటిని ఎందుకు కూల్చడం లేదో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని మున్సిపల్ పరిధిలో ఉన్న ఓ స్థలం లో గ్రామపంచాయితీ అనుమతితో అక్రమంగా షెడ్డు నిర్మాణం జరుగుతున్న మున్సిపల్ అదికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పై అంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. కొందరు రాజకీయ నాయకులతో పాటు మున్సిపల్ అధికారులకు భారీగా ముడుపులు ముట్టాయని ఆ కారణంగానే అక్రమ కట్టడం అని తెలిసిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ కట్టడాల విషయంలో ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఆందోళనలో చేపడతామని ,మున్సిపల్ ముట్టడి కూడా చేస్తామని హెచ్చరించారు. ఇట్టి మున్సిపల్ అవినీతిపై వరంగల్ ఆర్జెడి రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ కు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో మెట్ పల్లి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ ఖుతుబొద్దిన్ పాషా, కోరుట్ల నియోజకవర్గ మాజీ యూత్ ప్రెసిడెంట్ రామ్ ప్రసాద్, యూత్ యూత్ నాయకులు కోటగిరి చైతన్య, పట్టణ కాంగ్రెస్ దళిత మోర్చా నాయకులు కంభ సురేష్, పొట్ట రాజేష్ నాయకులు నవీన్, బొక్కెన పల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

# పిల్లలకు పౌష్టికాహారం ను అందించాలి

## ప్రొఫెసర్ చంద్ర శేఖర్

పెండ్లి మర్రి సెప్టెంబర్08ఏ ఆహారమైతే మన ఆరోగ్యాన్ని పెంపొందించి అనారోగ్యం పాలు కాకుండా శక్తివంతం గా వుంచి జీవపరిణామము మెరుగవుతుంది దో దానినే పౌష్టికాహారం అంటామని ఫాతిమా వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. చంద్ర శేఖర్ అన్నారు. సెప్టెంబర్ నెల లో జరిగే జాతీయ పౌష్టికాహార మాసోత్సవాల ను ఈ నెల 7 వ తేదీన పెండ్లి మర్రి మండలంలోని వెల్లటూరు గ్రామము లో గల ఫిమ్స్ గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రం మరియు అంగన్ వాడి కేంద్రం వారు సంయుక్తంగా నిర్వహించారు వారి పరిధి లోని బాలింతలకు, చంటిబిడ్డల తల్లులకు పౌష్టికాహారం ను కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ గణాంకాల ప్రకారం పోషకాహార లోపం వలన ప్రపంచ వ్యాప్తంగా 5 సంవత్సరం లలోపు పిల్లలు దాదాపు 149 మిలియన్ల మంది వయసుకు తగిన బరువు, 45 మిలియన్ల మంది తగిన ఎత్తు లేకుండా అలాగే 38.9 మిలియన్ల మంది ఊబకాయం తో బాధ పడుతున్నారని, దాదాపు నలభై ఐదు శాతం మంది పోషకాహార లోపం తో చనిపోతున్నారని దీనిని నివారించ వలసిన బాధ్యత మనందరి మీద వున్నదని డాక్టర్ చంద్ర శేఖర్ అన్నారు . ప్రతి ఒక్కరూ కూడా శుభ్రమైన, సురక్షితమైన ఆహారం ను తీసుకోవాలని, రోజు తినే ఆహారం తో పాటు తాజా గా వుండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని ఇవే కాకుండా పాలు, గుడ్లు, పిండి పదార్థాలు, మాంస కృత్తులు, అవసరమైన కొవ్వు పదార్థాలు, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు, కార్బోహైడ్రేట్స్, విటమిన్లు, తగినంత నీరు తీసుకోవటం వలన శరీరానికి కావాల్సిన శక్తి సమకూరుతుందని అలాగే గర్భంతో ఉన్నప్పుడు, బిడ్డకు పాలిస్తున్నప్పుడు అదనపు ఆహారం తీసుకోవాలని, ఎవ్వరూ కూడా రక్త హీనత బారిన పడకూడదని బిడ్డపుట్టిన వెంటనే ముర్రు పాలు ఇవ్వటం మరవకూడదు అని అలాగే బిడ్డకు 4 నుంచి 6 నెలల వయస్సులో పాలతో పాటు అదనపు ఆహార పదార్థాలు ఇవ్వాలి అని డాక్టర్ చంద్ర శేఖర్ అన్నారు.

# మనుబోలు రైతుల సమస్యలపై నేషనల్ హైవే అథారిటీ పిడి ని కలిసిన జిల్లా టిడిపి నాయకులు

నెల్లూరు సెప్టెంబర్ 8, (న్యూస్ పల్స్) మనుబోలు రైతుల సమస్యపై నెల్లూరులోని అయ్యప్పగుడి సెంటర్ లో ఉన్న నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గోవర్ధన్ ను కలిసిన మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి , టీడీపీ నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి షేక్ అబ్దుల్ అజీజ్ కలిసి, రైతుల సమస్యలను ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుబోలు నుంచి బద్దెవోలు క్రాస్ రోడ్డు వరకు హైవేకు ఇరువైపులా ఎత్తయిన వంతెనలు నిర్మాణాలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. వంతెనలను నిర్మిస్తున్నఎత్తైన వంతెన నిర్మాణం కారణంగా సుమారు వెయ్యి ఎకరాల రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి అని తెలిపారు.రైతులు తమ పొలాల్లోకి వెళ్లడంతో పాటు, పశువులను కూడా తోలుకెళ్లేందుకు వీలుగా సర్వీసు రోడ్డు నిర్మించాలని కోరారు.అవసరమైతే భూసేకరణ జరిపి , అయినా సర్వీసు రోడ్డు నిర్మించాలనే మా వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.జాతీయ రహదారిని కోవూరు నుంచి వైజాగ్ వరకు ఆరులేన్లుగా మార్చారు అని తెలిపారు.ట్రాఫిక్ ఎక్కువగా ఉండే నెల్లూరు-చెన్నై మార్గంలో ఇంకా ఆరులేన్ల రహదారి నిర్మాణం చేపట్టకపోవడం దురదృష్టకరం అన్నారు.నెల్లూరు-చెన్నై మార్గంలో ఆరులేన్ల రహదారి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.ఆ ప్రతిపాదనలు హైవే అధికారులు సిద్ధం చేస్తే గౌరవ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు దృష్టికి తీసుకెళతాం అన్నారు.నెల్లూరు అంటే ప్రత్యేక ప్రేమాభిమానులు చూపించే వెంకయ్య నాయుడు మా వినతిని తప్పక మన్నిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి లో బొమ్మి సురేంద్ర , జెన్ని రమణయ్య, జిల్లా అధికార ప్రతినిధి సంపత్ కుమార్ యాదవ్, నాయకులు కొంకల దశరధ నాగేంద్రప్రసాద్, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, గుమ్మడి రాజా యాదవ్, కాకర్ల తిరుమల నాయుడు, పచ్చిపాల రామిరెడ్డి, పద్మానాభ రెడ్డి, రమణారెడ్డి, రాయపాటి కిరణ్ మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుత మృతి

మహబూబ్ నగర్ మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం కాకతీయ సమీపంలో తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న దేవరకద్ర పోలీసులు అటవీశాఖ అధికారులు సమాచారం అందించారు.హుటాహుటిన ఘటన స్థలానికి అటవీశాఖ అధికారులు చేరుకొని దర్యాప్తు చెప్పట్టారు.సమీప మన్యం కొండ గుట్టల నుంచి ఆహారం కోసం రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందిందని ఫారెస్ట్ అధికారి అంటున్నారు .

## డి టీ కి వినతిపత్రము సమర్పించిన జనసేన నాయకులు



దర్శి సెప్టెంబర్ 8 ( విభారె) జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మరియు దర్శి నియోజకవర్గ ఇంచార్జి బొటుకు రమేష్ బాబు సూచనల మేరకు, గౌరవ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమువారు హిందువుల మనోభావాలను గౌరవించి, తమ నిర్ణయమును పునస్సమీక్షించి, శ్రీ వినాయకచవితి పర్వదిన సాంప్రదాయ వేడుకలకు అనుమతి మంజూరు చేయవలసిందిగా కోరుతూ బుధవారం దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ తరపున ఒక వినతి పత్రమును దర్శి మండల డిప్యూటీ తహసీల్దార్ కి సమర్పించారు. కరోనా నిబంధనలు పాటిస్తూనే శ్రీ విజయ గణేష్ స్వామి వారి వేడుకలు చేసుకోవచ్చునని, హిందువులకు మరీ ముఖ్యంగా విద్యార్థులకు శ్రీ వినాయకచవితి పండుగ చాలా విశిష్టమైనది కనుక వేడుకలకు అనుమతి ఇచ్చి హిందువుల మనోభావాలను గౌరవించవలసిందిగా ప్రభుత్వానికి సూచించారు. ఈ కార్యక్రమములో జనసైనికులు సర్వశ్రీ పసుపులేటి చిరంజీవి, పుప్పాల పాపారావు, మాదా వెంకట శేషయ్య, చాతరాసి కొండలు, షేక్ ఇర్షాద్, జడల వెంకట్, పుప్పాల రుద్ర, ఉప్పు ఆంజనేయులు, తోట వెంకీ, పార్సెపు హనుమంతరావు, ఈర్ల కొండలు, అబ్బు అఖిల్, చలువాది శివ, పసుపులేటి సాయి, సానే గుర్నాథం, మరెడ్డి పవన్ , ఆవుల కొండలు, అంచుల వీరాంజనేయులు, పి. నాగేశ్వర రావు, బి. పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## మాచని సోమప్ప పాఠశాలలో అక్రమ డొనేషన్లు అరికట్టాలి...



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 8 ( విభారె) పట్టణము లో మాచాని సోమప్ప పాఠశాల పేద విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని పి.డి.ఎస్.యు జిల్లా ఉపాధ్యక్షుడు మహేంద్ర బాబు, ఎన్.ఎస్.యు.ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ యాదవ్, ఏఐఎస్ఏ డివిజన్ కార్యదర్శి సురేంద్ర బాబు, ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉసేన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మాచని పాఠశాల ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మహానుభావుని పేరు పెట్టి పాఠశాల నిర్వహిస్తూ పేద, మధ్య విద్యార్థులకు విద్యను సీట్లు ఇవ్వకుండా,

### ప్రభుత్వ నిబంధనలు పాటించని మాచని యాజమాన్యం......

### పేద విద్యార్థులకు సీట్లు ఇవ్వాలని పాఠశాల ముందు విద్యార్థి సంఘాలు ఆందోళన...

అక్రమ డొనేషన్ లు వసూలు చేస్తూ సీట్లను అమ్ముకుంటున్నరాని వారు అన్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కి ఇష్టరాజ్యాంగ అడ్మిషన్ నిర్వహిస్తూ పెద ప్రజలను దోపిడీ చేస్తున్నారని విద్యార్థులు ఫీజులు కడితేనే పై తరగతులకు ప్రమోట్ చేస్తామని లేకపోతే డోమోట్ చేస్తామని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురించేస్తున్నారని వారు వాపోయారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అక్రమ డొనేషన్లు, ఫీజుల దోపిడీని అడ్డుకట్ట వేయాలని లేనిపక్షంలో పాఠశాల ముందు దశలవారీగా ఉద్యమాలు ఉదృక్తం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థి సంఘాల నాయకులు రామ కృష్ణ నాయుడు,నరసింహా రెడ్డి,బీమేష్, మునిస్వామి, హరి, నవీన్, సుందరాజు రవి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేసిన 12 వార్డు కౌన్సిలర్

నంద్యాల సెప్టెంబర్ 8 ( విభారె) నంద్యాల పట్టణంలో బుధవారం నాడు కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త ఆధ్వర్యంలో స్థానిక వి సి కాలనీ యందు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయడమైనది. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్ గుప్త మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకై మట్టితో చేసిన విగ్రహాలకు పూజ చేసి నిమర్జనం చేయడం వల్ల మన పర్యావరణాన్ని మనమేకాపాడుకున్న వాళ్ళము అవుతాం అని అన్నారు . ఈ కార్యక్రమం గత ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నాం అని తెలిపారు. పర్యావరణాన్ని రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం పోటికల్ ఛైర్మెన్ కండె శ్యామ్ సుందర్ లాల్ మాట్లాడుతూ



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన విగ్రహాలు వాడడం మనమనీతకు మనమే మన పర్యావరణాన్ని చెడకొట్టే వాళ్ళం అవుతామని కాబట్టి మట్టి తో తయారు చేసిన విగ్రహాలనే ఉపయోగిద్దాం అని అన్నారు , ఆ మహా గణపతిని పూజించడం వల్ల ఇప్పుడున్న భయంకర వైరస్ ను పరద్రోలచ్చని అన్నారు. ఈ కార్యక్రమం గత ఐదు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ఉపాధ్యక్షులు జె వి సి ప్రసాద్,కార్యదర్శులు నాగరాజు,జనార్ధన్, అనిల్,సుబ్బారావు. వాసవి క్లబ్ సభ్యులు సతీష్,శివశంకర్,మహేంద్ర,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులు శిల్ప నగర పరిస్థితి చూడండి

నంద్యాల సెప్టెంబర్ 8 ( విభారె) . ఇది రైతు నగరం దగ్గర శిల్ప నగర్ పరిస్థితి..వర్షాలు అధికంగా కురవడం వలన రోడ్లు లేక ఇండ్ల ముందర నీళ్లు నిలబడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కాలనీ వాసులు ..నీళ్లు వచ్చి 3 రోజులు కావస్తున్నా ఒక్క అధికారి కూడా రాలేదన్నారు. ఈ నీటి వలన అటు విద్యార్థులకు మరియు అక్కడ ఉంటున్న కుటుంబాలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు .పక్కనే వార్డ్ సచివాలం ఉన్న ఒక్క అధికారి కూడా ఇక్కడికి వచ్చి కనీసం చూడ నైనా చూడ లేదని కాలనీ వాసులు వాపోతున్నారు .ఇది అధికార పార్టీ శాసన సభ్యులు శిల్ప గారి ఇంటి పేరుతో ఉన్న శిల్పా నగర్ వారు కుడా స్పందించక పోవడం దారుణం అని పలువురు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. .ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ మరియు అధికారులు స్పందించి శిల్పా నగర్ ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.




## వినాయక చవితి ఉత్సవాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరైంది కాదు

### విశ్వహిందూ పరిషత్




నంద్యాల సెప్టెంబర్ 8 ( విభారె) – నంద్యాల పట్టణంలో బుధవారం నాడు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో వినాయక చవితిని ఇళ్లలోనే జరుపుకోవాలంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ నంద్యాల పట్టణంలో భారీ ఎత్తున విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. పట్టణంలో హిందూ ధార్మిక నాయకులతో కలిసి భారత మాత దేవాలయం నుంచి తాలుకా అఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు యర్రం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ హిందూ వ్యతిరేక ప్రభుత్వ విధానాలను ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మానుకోవాలని లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. భాజపా సీనియర్ నాయకులు మేడా మురళీధర్ మాట్లాడుతూ హిందువుల పట్ల వివక్ష దేనికి సంకేతమని వాపోయారు , గత నెల రోజులుగా రాష్ట్రం లో జరుగుతున్న వివిధ మతాల పండగల కు లేని కరోనా ఆంక్షలు ఇప్పుడెలా గుర్తొచ్చాయని ఎద్దేవా చేసారు..వీ హెచ్ పీ . రాష్ట్ర సంపర్క ప్రముఖ్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ మండప నిర్వాహకులందరూ కోవిడ్ నియమాలు పాటిస్తూ పండగ సాంప్రదాయ బద్ధంగా చేసుకోవాలని మన పండగ చేసుకోటానికి అనుమతులు కోసం వేచి చూసే దయనీయ స్థితి లో హిందూ సమాజం లేదన్నారు.మెజారిటీ హిందూ ఓట్ల తో గెలిచిన ప్రజా ప్రతినిధులు హిందువుల ప్రాథమిక హక్కు అయినటువంటి పర్వదినాలపై అర్థం లేని ఆంక్షలు విధిస్తే ప్రజలు రాబోవు ఎన్నికలలో తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సందీప్ , నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ , లింగేశ్వర బాబు , నగర కార్యదర్శి శేష సాయి , ధర్మ జాగరణ రామ్ ప్రసాద్ మరియు వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలియజేసారు..

## గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

తుగ్గలి సెప్టెంబర్ 8 ( విభారె)తుగ్గలి మండలం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం మండల కమిటీ సమావేశం ఉప్పరపల్లె రమేష్ అధ్యక్షతన బుధవారం రోజున స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు అంజి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విఆర్ఎల సమస్యలను పరిష్కరించాలని,జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని, ప్రభుత్వం ఏర్పడిన వారంలోపు జీతాలు పెంచుతామని,టిఎ,డిఎ పెంచామని,అర్హత ఉన్న వాళ్ళందరికి ప్రమోషన్ ఇస్తామని,నామిని లను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా జగన్ స్పందించకపోవడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం అని ఆయన తెలియజేశారు. ఈ సెప్టెంబర్ నెల 26 వ తేదీన కర్నూల్ లో జరుగు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా మహాసభలో మా డిమాండ్స్ పై చర్చ జరిపి పోరాటాలకు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నాం అని వారన్నారు. ప్రతి వీఆర్ఏ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు వెంకటేశ్వర్లు,నరసింహ,శేఖర్,హంపయ్య,చంద్ర, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.



## క్రేజీ బ్యూటీ సెకండ్ హీరోయిన్ గా అవసరమా?

సినిమా ఇండస్ట్రీలో స్టార్ డమ్ దక్కించుకునేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుంది. హీరోయిన్స్ కెరీర్ ఆరంభంలో చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ప్రస్తుతం స్టార్స్ గా ఉన్న చాలా మంది హీరోయిన్స్ కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి పలు సందర్భాల్లో చెప్పుకొచ్చారు. కాని కొందరికి మాత్రం అదృష్టం కొద్ది మొదటి లేదా రెండవ సినిమాతోనే స్టార్ డమ్ దక్కుతుంది. ఉప్పెన సినిమాతో కృతి శెట్టికి మొదటి సినిమాతోనే స్టార్ డమ్ దక్కింది. తెలుగు లో ఆమె ప్రస్తుతం క్రేజీ బ్యూటీ. యంగ్ హీరోలకు ఆమె మోస్ట్ వాంటెడ్ గా మారిపోయింది. రెండు పదుల వయసు లేకున్నా కూడా కోటికి పైగా పారితోషికంను ఈమె దక్కించుకుంటుంది అనేది ఇండస్ట్రీ వర్గాల టాక్. కోటి అయినా పర్వాలేదు అంటూ పలువురు ఫిల్మ్ మేకర్స్ ఆమె కు అడ్వాన్స్ లు ఇచ్చేస్తున్నారట. ప్రస్తుతం తెలుగు తో పాటు ఇతర భాషల్లో కూడా ఈమె జోరు కొనసాగుతుంది అంటూ వార్తలు వస్తున్నాయి. తమిళంలో రెండు మూడు ఆఫర్లు ఈమె చెంతకు వచ్చాయట. తాజాగా తెలుగు లో ఈమె అల్లు అర్జున్ ఐకాన్ సినిమాలో ఆఫర్ దక్కించుకుంది అనే ప్రచారం జరుగుతోంది.వేణు శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందబోతున్న ఐకాన్ సినిమాలో ఇప్పటికే పూజా హెగ్డేను హీరోయిన్ గా ఎంపిక చేశారు అనే వార్తలు ఆ మధ్య వచ్చాయి. ఐకాన్ కథానుసారంగా మరో హీరోయిన్ కూడా అవసరం ఉంటుందట. అందుకే ఆ పాత్రకు గాను కృతి శెట్టిని ఎంపిక చేశారు అనేది టాక్. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఐకాన్ మరి కొన్ని రోజుల్లో పట్టాలెక్కించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కనుక హీరోయిన్స్ విషయంలో తుది నిర్ణయం తీసుకునేందుకు చర్చలు జరుపుతున్నారట. పూజా హెగ్డే ఉన్న తర్వాత మరో హీరోయిన్ గా ఎవరు చేసినా కూడా పెద్దగా క్రేజ్ ఉండే అవకాశం లేదు. అంటే సెకండ్ హీరోయిన్ గా ప్రాముఖ్యత అంతంత మాత్రమే ఉంటుంది. అలాంటి అంతంత మాత్రం ప్రాముఖ్యత ఉన్న పాత్రను చేయాల్సిన అవసరం ఏంటీ అంటూ కృతి శెట్టిని కొందరు ప్రశ్నిస్తున్నారు. కృతి శెట్టి ప్రస్తుతం స్టార్ హీరోయిన్ గా దూసుకు పోతున్న క్రేజీ బ్యూటీ. అలాంటి కృతికి సెకండ్ హీరోయిన్ పాత్రలు అవసరం లేదు.ఐకాన్ లో కాకుంటే ఆ తర్వాత ఎప్పుడైనా అల్లు అర్జున్ తో నటించే అవకాశం వస్తుంది. అప్పటి వరకు వెయిట్ చేయాలి కాని ఇప్పుడే అల్లు అర్జున్ తో సెకండ్ హీరోయిన్ గా నటించి తనకు తాను తన క్రేజ్ ను తగ్గించుకోవడం కరెక్ట్ కాదు అంటూ సోషల్ మీడియాలో కృతి శెట్టి అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రామ్ తో లింగు స్వామి దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తున్న కృతి శెట్టి ఇటీవలే బంగార్రాజు సినిమాలో చైతూకు జోడీగా ఎంపిక అయ్యింది. మరో రెండు మూడు ప్రాజెక్ట్ లు కూడా దాదాపుగా కన్ఫర్మ్ అయ్యాయి. ఇంత బిజీగా ఉన్న నువ్వు ఎందుకు సెకండ్ హీరోయిన్ గా చేయాలి అంటూ అభిమానులు ప్రశ్నించడం ఖాయం. కనుక కృతి శెట్టి ఐకాన్ లో సెకండ్ హీరోయిన్ గా చేయాలనే ఆలోచన ఉంటే మానుకోవడం మంచిది అంటూ సినీ విశ్లేషకులు కూడా సూచిస్తున్నారు. అసలు విషయం ఏంటీ అనేది చూడాలి. అసలు ఐకాన్ లో ఆమె ను సంప్రదించారా అనేది కూడా తెలియాల్సి ఉంది.



## 'హరి హర వీరమల్లు' షూటింగ్ అప్డేట్.. పవన్ తో దర్శకనిర్మాతల మీటింగ్..!

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న ఎపిక్ మాగ్నమ్ ఓపస్ ఫిల్మ్ "హరి హర వీరమల్లు". క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి ఈ పీరియాడికల్ అడ్వెంచర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఏఎమ్ రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎ.దయాకర్ రావు ఈ సినిమాని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కరోనా సెకండ్ వేవ్ పరిస్థితుల్లో వాయిదా పడిన ఈ సినిమా షూటింగ్ త్వరలోనే పునఃప్రారంభం కానుంది. దీనికి సంభందించి పవన్ కళ్యాణ్ తో చిత్ర సమర్పకులు ఎ.ఎం. రత్నం – డైరెక్టర్ క్రిష్ ఈరోజు చర్చలు జరిపారు.పవన్ ప్రస్తుతం నటిస్తున్న 'భీమ్లా నాయక్' షూటింగ్ పూర్తవగానే "హరి హర వీరమల్లు" చిత్రం షూటింగ్ ప్రారంభించటానికి మేకర్స్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిత్రీకరించవలసిన కీలక సన్నివేశాలు – పాటలు – ఫైట్ సీన్స్ – షూటింగ్ లొకేషన్స్ – భారీ సెట్స్ వంటి విషయాల గురించి చిత్ర దర్శకనిర్మాతల మధ్య సమాలోచనలు జరిగాయని తెలుస్తోంది. ఇప్పటివరకు 'వీరమల్లు' షూటింగ్ దాదాపు యాభై శాతం పూర్తయిందని.. మిగిలిన భాగాన్ని నిరవధికంగా షూటింగ్ జరిపి పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత ఎ.దయాకర్ రావు తెలియచేశారు.ఇటీవల పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా "హరిహర వీరమల్లు" చిత్రాన్ని 2022 ఏప్రిల్ 29న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిని దృష్టిలో ఉంచుకొని చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. 17వ శతాబ్దం నాటి మొఘలాయిలు – కుతుబ్ షాహీల శకం నేపథ్యంలోని కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. అత్యున్నత సాంకేతిక విలువలతో అత్యద్భుతమైన విజువల్ ఫీస్ట్ గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు దర్శకుడు క్రిష్.పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాని తెలుగుతో పాటు హిందీ తమిళ కన్నడ మలయాళ భాషల్లో ఏక కాలంలో విడుదల చేయనున్నారు. 'హరిహర వీరమల్లు' చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బ్యూటీ జాక్వెలిన్ ఫెర్నాండేజ్ – హిందీ నటుడు అర్జున్ రామ్ పాల్ – మలయాళ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.అగ్రశ్రేణి సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. పాపులర్ సినిమాటోగ్రాఫర్ జ్ఞానశేఖర్ వి.ఎస్. కెమెరాను హ్యాండిల్ చేస్తున్నారు. ప్రముఖ రచయిత సాయిమాధవ్ బుర్రా ఈ చిత్రానికి సంభాషణలు రాస్తున్నారు. హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ బెన్ లాక్ ఈ సినిమాలో భాగం అవుతున్నారు. పవన్ కెరీర్ లో అత్యధిక బడ్జెట్ తో రూపొందుతున్న ఈ ఫస్ట్ హిస్టారికల్ మూవీ 'వీరమల్లు' ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




## టాలీవుడ్ లో అంజలి కనబడుట లేదు

తెలుగమ్మాయి అంజలి తమిళంలో స్టార్ హీరోయిన్ గా గుర్తింపు దక్కించుకుంది. దశాబ్దకాలం పాటు తమిళంలో అంజలికి మంచి ఆఫర్లు వచ్చాయి. ఇక టాలీవుడ్ లో చాలా కాలం క్రితమే ఎంట్రీ ఇచ్చినా కూడా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. డబ్బింగ్ మూవీ షాపింగ్ మాల్ మరియు జెర్నీలతో గుర్తింపు వచ్చింది. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో అందరి దృష్టిలో పడింది. ఆ తర్వాత టాలీవుడ్ లో బిజీ అవుతుందని ఆశించినా కూడా తెలుగమ్మాయి అనే ఒక కారణం వల్ల ఎక్కువ ఆఫర్లు రాలేదు. తనవంతు ప్రయత్నాలు చేస్తూ లేడీ ఓరియంటెడ్ చిత్రాలు సీనియర్ హీరోల సినిమాల్లో నటిస్తూ టాలీవుడ్ లో కెరీర్ ను నెట్టుకు వస్తుంది. టాలీవుడ్ లో కూడా చాలా కాలం పాటు ఫేమ్ ఉన్న నటిగానే నటిస్తూ వచ్చింది. ఈ ఏడాదిలో కూడా పవన్ నటించిన వకీల్ సాబ్ లో అంజలి కీలక పాత్రలో కనిపించింది. తెలుగు లో ఈమెకు మళ్లీ కొత్త ఆఫర్లు ఏమీ రావడం లేదట.లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో కూడా ఈమెను ప్రేక్షకులు ఎక్కువగా చూడక పోవడం వల్ల ఫిల్మ్ మేకర్స్ ఈమెను పట్టించుకోవడం లేదు అనే టాక్ వినిపిస్తుంది. పెద్ద ఎత్తున సినిమాల్లో నటించిన అంజలి ఇప్పుడు చేతిలో పెద్దగా సినిమాలు లేవు అనే టాక్ వినిపిస్తుంది. టాలీవుడ్ లో మొదటి నుండే ఈమె పై చిన్న చూపు అన్నట్లుగా ఉంది. కాని ఇప్పుడు కోలీవుడ్ లో కూడా వరుసగా ఆఫర్లు వస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. తెలుగు లో ఈమె మళ్లీ ఎప్పటికి సినిమా చేస్తుందో అనేది తెలియడం లేదు. తమిళంలో కూడా కొత్త సినిమా మొదలు పెట్టే విషయంలో స్పష్టత లేదు. ప్రస్తుతానికి ఒక్క కన్నడ మూవీలో ఈమె నటిస్తుందని.. ఇతర భాషల్లో ఈమె సినిమాల గురించి ఎలాంటి స్పష్టత లేదు అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.అంజలి మెల్ల మెల్లగా ఫేడ్ ఔట్ అవుతుందా అనే కామెంట్స్ కూడా వినిపిస్తున్నాయి. ఆమె హీరోయిన్ గా నటించిన పలు సినిమాలు ఆమెకు నటిగా మంచి పేరును తెచ్చి పెట్టాయి. అందంతో పాటు నట ప్రతిభ ఉన్న హీరోయిన్స్ ఇండస్ట్రీలో కొద్ది మంది మాత్రమే ఉంటారు. అంజలి ఆ జాబితాలో ఉంటుంది. కాని ఏ హీరోయిన్ అయినా లైఫ్ స్పామ్ ఇంత అని ఉంటుంది. దాదాపుగా పదిహేను ఏళ్లుగా అంజలి నటిస్తూనే ఉంది.



## ఇంగ్లండ్‌లో టీమిండియా వన్డే, టీ20 సిరీస్.. షెడ్యూల్ ఇదీ

లండన్: ఇంగ్లండ్‌లో ప్రస్తుతం ఐదు టెస్ట్‌ల సిరీస్ ఆడుతున్న టీమిండియా( ఎనిట లబ ఇనిణ ) వచ్చే ఏడాది జులైలో మరోసారి అక్కడ పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. 2022లో ఇంగ్లండ్‌లో ఇంటర్నేషనల్ కేలండర్‌ను ప్రకటించిన అక్కడి క్రికెట్ బోర్డు.. టీమిండియా షెడ్యూల్‌ను ప్రకటించింది. నిజానికి ప్రతి టూర్‌లోనూ టెస్ట్‌లతోపాటు వన్డే, టీ20 సిరీస్ కూడా జరగాల్సి ఉన్నా.. ఈసారి కొవిడ్ కారణంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌ను తర్వాత నిర్వహిస్తున్నారు.వచ్చే జులై 1న ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో టీ20 మ్యాచ్‌తో టీమిండియా టూర్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత జులై 3న ట్రెంట్‌బ్రిడ్జ్‌లో రెండో టీ20, జులై 6న ఎజియస్ బౌల్‌లో మూడో టీ20 జరుగుతుంది. ఇక జులై 9 ఎడ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుంది. ఆ తర్వాత జులై 12న ఓవల్‌లో రెండు, జులై 14న లార్డ్స్‌లో మూడో వన్డే జరుగుతాయి.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**